ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -229 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 20 జూన్ 2025



# నేరస్థులను ప్రోత్సహిస్తారా

## జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

**రౌడీలు, గూండాలకు విగ్రహాలు పెడతారా**

**యోగాను డైవర్ట్ చేయడానికి ఇంత రౌడీయిజమా**

**నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి**

**చట్టం తనపని తాను చేసుకు పోతుంది**

**మేము ఎక్కడా జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు**

**రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకోవాలా**

అమరావతి,**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
ఓ వైపు యోగా జరుగుతుంటే.. మరోవైపు వైసీపీ శ్రేణులు రప్పా రప్పా అంటున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. చంపండి.. నరకండి.. అని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా అని నిలదీశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా అల్లర్లు చోటు చేసుకున్న ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మిగతాది 2లో...

## వృధా నీటి వినయోగంపై ఎందుకీ రాద్ధాంతం




**కాళేశ్వరానికి నేనెప్పుడైనా అడ్డుపడ్డానా**

**ఎపి సిఎం చంద్రబాబు నాయుడు**

**బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

**పోలవరం తప్ప మరే ప్రాజెక్టుకు అనుమతి లేదని స్పష్టీకరణ**



# ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్

- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో మంత్రి లోకేశ్ భేటీ
- ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై చర్చ
- నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఒప్పందం
- ఉన్నత విద్యలో సంస్కరణలు, సాంకేతిక మద్దతుపై సమీక్ష

బ్రిటన్ మాజీ ప్రధాని, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకుడు టోనీ బ్లెయిర్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో టోనీ బ్లెయిర్ ను మంత్రి లోకేశ్ కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. ఏపీ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్ ను ఉపయోగించడానికి తమ సంస్థ అయిన టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) ద్వారా సహకరించేందుకు టోనీ బ్లెయిర్ అంగీకరించారు. మిగతాది 2లో...

## అమెరికా విద్యార్థి వీసాలు మళ్లీ షురూ..



**వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల తనిఖీ తప్పనిసరి**

**తనిఖీల కోసం ప్రొఫైళ్లను 'పబ్లిక్' మోడ్‌లో ఉంచుకోవాలని సూచన**

**దేశ భద్రత దృష్ట్యా వ్యక్తుల పూర్తి పరిశీలనకే ఈ చర్య**

**మే నెలాఖరు నుంచి నిలిచిపోయిన వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్**

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు కీలక అప్‌డేట్. గత కొంతకాలంగా తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ ప్రక్రియను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది.

# వైఫల్యాలు, మోసాలతో కూటమి పాలన

- ఏడాది కూటమి పాలనపై పోరాడుతున్నాం
- డైవర్షన్‌లో భాగంగానే నేతలపై కేసులతో వేధింపులు
- వెన్నుపోటు దినంతో నిరసన తెలిపాం
- కర్ఫ్యూ పరిస్థితుల మధ్య రెంటపాళ్ల పర్యటన
- ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలకు మోసం
- మ్యానిఫెస్టోపై ఇంటింటికి వెళ్లి ప్రజల ముందే నిలదీస్తాం
- మీడియా సమావేశంలో జగన్ వెల్లడి

అమరావతి,**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
ఏపీలో ఏడాదిగా కూటమి పాలనలో.. టీడీపీ, ఎల్లో మీడియాతో యుద్ధం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు,పాలన వైఫల్యాలు, మోసాల మధ్య చంద్రబాబు పాలన కొనసాగుతోందన్నారు.



## ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం

### ఏడాది సుపరిపాలనపై ప్రగతి నివేదిక






# నా జోక్యం లేదు

**భారత్-పాక్ యుద్ధంపై మాట మార్చిన ట్రంప్**

**తానే యుద్ధాన్ని ఆపేశానంటూ తొలుత ట్రంప్ వ్యాఖ్యలు**

**పాక్ ఆర్మీ చీఫ్ తో వాషింగ్టన్‌లో ట్రంప్ ప్రత్యేక సమావేశం**

**మోదీ, మునీర్ సమయస్ఫూర్తితోనే అణు ముప్పు తప్పిందని ట్రంప్ కితాబు**

**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
గత నెలలో భారత్, పాకిస్థాన్ మధ్య తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గంటల వ్యవధిలోనే తన వైఖరిని మార్చుకున్నారు. తొలుత తానే యుద్ధాన్ని ఆపేశానని ప్రకటించిన ఆయన, ఆ తర్వాత ఇరు దేశాలకు చెందిన ఇద్దరు తెలివైన వ్యక్తుల వల్లే అణు యుద్ధం తప్పిందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ విషయంలో అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వం వహించలేదని భారత్ స్పష్టం చేసింది.

# బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దు

**బనకచర్ల ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం**

**కేంద్రమంత్రి పాటిల్‌ను కలిసిన సిఎం రేవంత్, ఉత్తమ్**






# తెలంగాణ రైజింగ్ భేష్

**సిఎం రేవంత్ రెడ్డికి యూకే మాజీప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు**

**ఢిల్లీలోలెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్నతెలంగాణ, టిబిఐజీసి ప్రతినిధులు**

హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి గురువారం సమావేశమ య్యారు. మిగతాది 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నేరస్థులను ప్రోత్సహిస్తారా

## జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు నాయుడు



(మొదటి పేజీ తరువాయి)

గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఇరుకు వీధుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడతారా అని సీఎం చంద్రబాబు అడిగారు. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా అని ఫైర్ అయ్యారు. ఏపీలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా అని ప్రశ్నించారు. నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రౌడీయిజం చేసేవారిని, చట్టాన్ని ఉల్లంఘించేవారిని వదిలేయాలా అని నిలదీశారు. ఒక్కసారి ఉన్మాదులుగా మారితే వారిని మార్చగలమా అన్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు సీఎం చంద్రబాబు. 'కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది. అంతా యోగా చేస్తే పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇప్పుడు రప్పా రప్పా అంటున్నారు. గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లుగా నరికేస్తాం అంటున్నారు. ఒకప్పుడు చెడ్డ లక్షణాలు ఉన్న వ్యక్తిని రాజకీయాల్లో దూరం పెట్టేవారు. ఇప్పుడు వారినే వెనకేసుకుని తిరుగుతున్నారు. మేము ఎప్పుడైనా పోలీసులు వద్దంటే నిబంధనలకు విరుద్ధంగా వెళ్లామా. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, అత్యాచారాలు చేసే వారికి విగ్రహాలు పెడుతున్నారు. ఏపీలో గంజాయి చాలా వరకు కంట్రోల్ చేశాం. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి ఈగల్ టీం ఏర్పాటు చేశాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అరాచకాలు జరిగాయి. తాను చేసిందే చట్టం అంటే ఎలా కుదురుతుంది. మీరు మారాలి.. లేకుంటే ప్రజలు మార్చాలి. వైసీపీ నేతలు సమాజానికే పెద్ద సమస్యగా మారిపోయారు. అన్ని నేరాల్లో వాళ్లే ఉంటున్నారు.. మళ్లీ రాజకీయం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కుప్పంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు పనులతో అతలాకుతలం చేస్తామంటే సరికాదు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి ఇప్పుడు పరామర్శా. వైసీపీ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయాడు. వైసీపీ నేతల వాహనం ఢీకొని చనిపోతే పట్టించుకోరా. రౌడీయిజం చేయాలని అందరినీ ప్రోత్సహిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఏపీ మొత్తం ఒక మంచి పని చేస్తే వైసీపీ నేతలు మాత్రం నేరాలకు పాల్పడుతున్నారు. నేరస్థుల మెంటాలిటీ అలానే ఉంటుంది. ఇష్టానుసారం వ్యవహారిస్తే చట్టం ఊరుకోదు. విచిత్రమైన మనస్తత్వం ఉన్నవాళ్లు అలా మాట్లాడుతారు. ఆయన చేసిన పనులను చూసి జనం ఆ తీర్పు ఇచ్చారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన నిమిత్తం 3 కార్లు, 100 మంది జనానికి మాత్రమే ఏపీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అంతకంటే ఎక్కువమంది ఎలా వెళ్లారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు అనుమతులు ఇచ్చారా. 2029లో ఎన్నికలు ఉంటాయి.. ఇప్పుడు నీ వెంట వచ్చిన జనాన్ని చూసి మేము ఎందుకు భయపడతాం. అప్పటికీ నీ ఆటలు ఎలా సాగుతాయనేది చూస్తాం. మీ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రాష్ట్ర నాయకుడిని ఎన్నుకునేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి. ప్రజలు అడిగితే మేము సమాధానం చెబుతాం. కానీ మా నేతలను వైసీపీ శ్రేణులు నిలదీస్తే తాట తీస్తాను .. ఇందులో సందేహం లేదు. నీ వాహనాలు ఢీ కొట్టి ఒకరు చనిపోతే ఎందుకు పరామర్శించవు. బెట్టింగ్ ప్రాణానికి ఉన్న విలువ నీ వాహనం ఢీకొట్టి చనిపోయిన వారి ప్రాణానికి లేదా. నన్ను, వైజాగ్, తిరుపతిలో ఆపితే నేను దౌర్జన్యం చేశానా. 40 వేల మందిని పొదిలిలో ఎందుకు పోగేశావ్. నువ్వు పొగాకు వేలం కేంద్రానికి 40 వేల మందిని ఎలా తీసుకెళ్లావు. కుప్పంలో జరిగిన సంఘటనకు నేను సిగ్గు పడుతున్నాను. శాంతి భద్రతలు ప్రభుత్వానికి చాలా ముఖ్యం. చంపడం కూడా సినిమాల్లో చూపిస్తారు... వాటిని చూసి నేను బయట చంపుతానంటే ఎలా అని' సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

## వృథా నీటి వినియోగంపై ఎందుకీ రాద్ధాంతం

సముద్రంలో కలిసే వృథా నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. బనకచర్లపై తెలంగాణ వివాదం చేయడం సరికాదని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు.'మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి. కొత్త అథారిటీ ఎలా కేటాయిస్తే అలా తీసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని చంద్రబాబు అన్నారు. వృథా నీటి విషయంలో గొడవ పడడం ద్వారా ప్రయోజనాలు ఉండవన్నారు.

# వైఫల్యాలు, మోసాలతో కూటమి పాలన

(మొదటి పేజీ తరువాయి)

గురువారం తాడే పల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. చంద్రబాబు అరాచక పాలనకు వ్యతిరేకంగా జూన్4న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేశారు. టీడీపీ నేతలు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు రెంటపాళ్ల వెళ్లా. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య నా రెంటపాళ్ల పర్యటన జరిగింది. అయినా విజయవంతమైంది. మా పార్టీ శ్రేణుల్ని పరామర్శిస్తే తప్పా? మొన్నటి పొదిలి పర్యటనలో 40వేల మందిపై రాళ్లేసే ప్రయత్నం చేశారు. రైతులు సంయమనం పాటించారు. అయినా కేసులు పెట్టారు. రైతుల సమస్యల గురించి ఎవరూ మాట్లాడకూడదు. సంఘీభావం తెలపకూడదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎందుకు భయపడు తున్నారు. ఓ టీవీ ఛానెల్‌లో చంద్రబాబు అహంకార మాటలు వినండి. ప్రతిపక్షంను భూస్థాపితం చేస్తారట. ప్రశ్నిస్తున్న వ్యక్తిని భూస్థాపితం చేస్తారా?. ఏడాది కాలంలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజల్లో చంద్రబాబు పాలనపై అసహనం పెరిగింది. ఆ అసహనాన్ని డైవర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై, నేతలపై కేసులు పెడుతున్నారు. టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. మద్యం కేసులో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. చెవిరెడ్డి అరెస్ట్ నిజంగా అశ్చర్యకరం. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని గన్‌మెన్‌ను బలవంతం చేశారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనందుకు గన్‌మెన్‌పై దాడి కూడా చేశారు. తనపై జరిగిన దాడిని గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీకి గన్‌మెన్ లేఖ రాశారు. మరో గన్‌మెన్‌ను ప్రలోభాలకు గురిచేసి వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇప్పించుకున్నారు. చెవిరెడ్డితో పాటు ఆయన కొడుకును కేసులో ఇరికించారు. సొంత నియోజవకర్గంలో గెలవలేని వ్యక్తి. చంద్రగిరిలో ఇబ్బంది ఉండకూడదనే చెవిరెడ్డిని అరెస్ట్ చేశారు. తప్పుడు కేసులో పిన్నెల్లిని అరెస్ట్ చేశారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లి బెయిల్ తీసుకొచ్చాం. మళ్లీ తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. సురేష్ భార్యపైనా కేసులు పెట్టారు. వల్లభనేని వంశీపై 11 కేసులు పెట్టారు. జోగి రమేష్ కొడుకు, కాకాణిపై తప్పుడు కేసులు. కృష్ణమోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిపైనా అక్రమ కేసులు పెట్టారు. కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, పేర్నినాని, వైవి సుబ్బారెడ్డి,ఆయన కుమారుడిపై తప్పుడు కేసులు. దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే ఆర్కే,అంబటి రాంబాబు, విడదల రజినిపై తప్పుడు కేసులు దళిత ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పైనా అక్రమ కేసులు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిపై, ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్, గోరంట్ల మాధవ్‌పై కేసులు. ఇలా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఏం పాపం చేశారు? ఏం చేశారని కొమ్మినేనిని అరెస్ట్ చేశారు?టీవీ డిబెట్‌లో అనలిస్ట్ మాటలకు కొమ్మినేనికి ఏం సంబంధం? గతంలో కేఎస్ఆర్ ఉద్యోగాన్ని చంద్రబాబు ఊడగొట్టిం చారు. కేఎస్ఆర్ అరెస్ట్ అక్రమమేనన్న సుప్రీంకోర్టు.. తనకున్న విచక్షణాధికారాల్ని ఉపయోగించి ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలించింది. సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని జగన్ అన్నారు. ప్రజల కోసం ఆలోచన చేసిన ప్రభుత్వం మాది. 32లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. 22 లక్షల ఇళ్లను మంజూరు చేసి 10లక్షల ఇళ్లు పూర్తి చేశాం. చట్టం చేసి మరి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అవకాశం కల్పించాం. మహిళలపై ఎవరికి గౌరవం ఉంది?. మహిళలంటే చంద్రబాబుకు గౌరవం లేదు. వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబుకు ఆయనే సాటి అంటూ విమర్శించారు. 5వేల కోట్లు కరెంట్ బిల్లుల బాదుడు,గవర్నమెంట్ స్కూళ్లు కాలేజీ కాలేజీల్ని నిర్వీర్యం చేశాడు. ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో ఫీజుల పేరిట బాదుడే బాదుడే. రేషన్ వెహికల్స్ వాహనాల్ని తీసేశాడు. రేషన్ ద్వారా ఇచ్చే పప్పు దాన్యాల్ని ఎగనామం పెట్టాడు. ఫలితంగా పప్పు దాన్యాల రేట్లు పెంచి బాదుడే బాదుడు. కొత్త ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి.. సుమారు 3లక్షలపై చీలూకు ఉద్యోగాల్ని తొలగించారు. పంటలకు సరైన మద్దతు లేదు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏమైనా ఒరిగిందా అంటే? అదీ లేదు. వచ్చీ రాగానే పీఆర్సీ అన్నారు. పీఆర్సీని ఆపేశారు. ఈ జులై 1వ తారీఖుతో కలిసి నాలుగు డీఏ ఇవ్వాలి. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన 20 వేలకోట్ల వరకు ఆపేశారు. చంద్రబాబు తాను అబద్ధమాడుతూ.. తానెప్పుడూ ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టడం లేదన్నాడు. మద్యం ఆదాయం తాకట్టుపెట్టడం లేదు. కానీ 4-4-2025 నాడు విడుదల చేసిన జీవో 69 కింద ఏపీఎండీసీ కింద 436 మినరల్ ప్రాజెక్ట్‌ను తాకట్టు పెట్టారు. వాటి విలువ 191,000 కోట్లు అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను అందరూ రెడీగా పెట్టుకోవాలి. చంద్రబాబు తన పాలన గురించి తెలుసుకునేందుకు మీ ఇంటికి ఎమ్మెల్యేలు, ఇతర నేతల్ని పంపిస్తున్నారు. నేతలు వచ్చినప్పుడు మ్యానిఫెస్టో, బాబుష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో బాండును అందించారు. ఆ బాండు, ఎన్నికల మ్యానిఫెస్టో చూపిస్తూ ఎంత వరకు ఎన్నికల హామీలు నెరవేర్చారో అడగండి. అప్పుడైనా చంద్రబాబుకు ఎన్నికల హామీలు నెరవేర్చుతారో చూడాలి. ఒకవేళ మీ వద్ద 'బాబు మ్యానిఫెస్టోని గుర్తు తెచ్చుకుంటూ' అనే పేరుతో చంద్రబాబు మ్యానిఫెస్టోను డౌన్‌లోడ్ చేసుకునేలా క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ అందుబాటులోకి తెస్తుంది' అని అన్నారు. ప్రభుత్వంపై ఫైట్ చేయండి. రాష్ట్ర ప్రజల తరుపున వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం ఏడాది సుపరిపాలనపై ప్రగతి నివేదిక

అమరావతి:**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**

'రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి. అలా నిరంతరం పరితపించే నేను గత సంవత్సర కాలంలో చేపట్టిన శాఖల ద్వారా చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలందరి ముందు ఉంచడం నా నైతిక బాధ్యత. అధికార బాధ్యతలు స్వీకరించి సంవత్సరం అయిన సందర్భంగా ఈరోజు మీ ముందుకు తీసుకొస్తున్నాను..' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్?కల్యాణ్? పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రిగా పవన్?కల్యాణ్? బాధ్యతలు చేపట్టి గురువారంతో సంవత్సరం పూర్తైన సందర్భంగా సమగ్ర అభివృద్ధి నివేదిక విడుదల చేశారు. దీనితో పాటు పవన్?కల్యాణ్? ఓ లేఖను విడుదల చేశారు. 'ప్రియమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు%ా% గత సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి అండగా నిలబడి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్లు నుండి విముక్తి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..' అని ఆయన పేర్కొన్నారు.2019 నుండి 2024 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయింది, అభివృద్ధికి దూరమైంది, శాంతిభద్రతలు క్షీణించాయి, యువత భవిష్యత్తుపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి, మహిళలకు రక్షణ కరువైం దని తెలిపారు. రాష్ట్ర రాజధాని నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా కదలకుండా నిర్మానుష్యంగా మారిన సమయంలో రాష్ట్రాన్ని రక్షించేందుకు, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలో, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ప్రజల పక్షాన ఎల్లవేళలా నిలబడి పోరాడే మన సమిష్టి సహకారంతో ఎన్?డీఏ కూటమి 164 అసెంబ్లీ సీట్లను గెలిచి 94% స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు.ఇంతటి గెలుపును అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అహర్నిశలు కృషి చేస్తూ సంవత్సర కాలంలోనే గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తూ, ప్రజల్లోనే కాకుండా, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామన్నారు.

## ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్

(మొదటి పేజీ తరువాయి)

ఆ మేరకు విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ) నడుమ 2024 డిసెంబర్ లో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా టీబీఐ విజయవాడలో తమ ఎంబెడెడ్ బృందాన్ని మొహరించి రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తోంది. అందులో 1. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలు 2. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపన. ఏపీ విద్యాశాఖ, టీబీఐ నడుమ ఒప్పందం తర్వాత ఏ మేరకు పురోగతి సాధించారనే అంశంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సలహా బోర్డులో చేరాల్సిందిగా టోనీ బ్లెయిర్ ను మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా ఆహ్వానించారు. నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ మధ్య ఒప్పందం కుదిరింది. ఆగస్టులో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్ కు టీబీఐ భాగస్వామిగా ఉంటుందని టోనీ బ్లెయిర్ అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమెరికా విద్యార్థి వీసాలు మళ్లీ షురూ..

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ఈసారి వీసా దరఖాస్తులతో పాటు దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలను తప్పనిసరిగా పరిశీలించనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది.ఈ కొత్త నిబంధనపై విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ, "ఈ సోషల్ మీడియా తనిఖీ ద్వారా మా దేశంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని సమగ్రంగా పరిశీలించడానికి వీలు కలుగుతుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవసీ సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'గా మార్చుకోవాల్సి ఉంటుంది" అని తెలిపారు.

ఈ ఏడాది మే నెలాఖరు నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో కొత్తగా విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారి ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీ ప్రక్రియలో భాగంగా సోషల్ మీడియా ఖాతాల పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నందునే ఈ విరామం తీసుకున్నామని అప్పట్లో విదేశాంగ శాఖ పేర్కొంది. తాజాగా ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది.

## బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దు

న్యూఢిల్లీ,**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం , బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ రైజింగ్ భేష్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి టోనీబ్లెయిర్‌తో తెలియజేశారు. మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సిఎం రేవంత్ వెల్లడించారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను యూకే మాజీ ప్రధానమంత్రికి సిఎం తెలియజేశారు.'తెలంగాణ రైజింగ్ 2047' ముఖ్య అంశాలను తెలియజే స్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సిఎం తెలిపారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్ యూనివర్శిటీ వంటి ప్రాజెక్టులపై టోనీబ్లెయిర్ ఆసక్తి చూపారు. ఇరు నేతలు గంటకుపైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమల్లో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టిబిఐజిసి ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని (లెటర్ ఆఫ్ ఇంటెంట్)ను పరస్పరం మార్చుకున్నారు.1997 నుంచి -2007ల మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘకాలం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహారచన వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టిబిఐజిసి)ను స్థాపించారు. ఈ సమావేశంలో నీటి పారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సిఈఓ జయేశ్ రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, టిబిఐజిసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారత్, పాక్ కాల్పుల విరమణలో నా జోక్యం లేదు

### మోడీ వ్యాఖ్యలతో ట్రంప్ యూ టర్న్

వాషింగ్టన్,**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చింది తానేనంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే పాట పాడిన ట్రంప్ నాలుక మడతేశారు. తూచ్ నేను కాదంటూ ప్రకటించారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన భారత ప్రధాని మోదీ ఈ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేదీ లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో దీనిపై మరోసారి మాట్లాడిన ట్రంప్.. ఎట్టకేలకు వాస్తవాన్ని అంగీకరించారు. ఇందులో తన జోక్యమేమీ లేదని.. భారత్-పాక్ దేశాలే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చిన అనంతరం ఓవల్ ఆఫీసులో వీరిద్దరూ మీడియా ముందుకువచ్చారు. ఈసందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'చాలా తెలివైన ఇద్దరు వ్యక్తులు యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించారు. లేదంటే ఆ పరిస్థితులు అణుయుద్ధానికి దారితీసేవే. ఆ రెండూ అణుశక్తి కలిగిన దేశాలు. అందుకే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని పేర్కొన్నారు. అంతేగాక.. భారత్, పాకిస్థాన్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందాలపై తాము పనిచేస్తున్నట్లు వెల్లడించారు. భారత్, పాకిస్థాన్ మధ్య గత నెలలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేమీ లేదని మోదీ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఇది రెండు దేశాల సైన్యం చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, మధ్యవర్తి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకే ఫోన్‌లో చెప్పానని మోదీ తెలిపారు. తమ వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు.

# కాంట్రాక్టర్ల బిల్లులు “నిధి” పోర్టల్ లో ఎక్కించకపోవడానికి కారణం.?

**రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో ఎక్కిస్తున్నారు.**
**నంద్యాల మున్సిపాలిటీ కి వర్తించదా.**
**హస్తవాసి కోసమే ఎక్కించడం లేదా.**
**6 కోట్ల బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న కాంట్రాక్టర్లు.**
**నూతన కమిషనర్ శేషన్న అయినా స్పందిస్తారో లేదో.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:** రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు,మున్సిపాలిటీలు ఒక ఎత్తు అయితే నంద్యాల మున్సిపాలిటీ మరో ఎత్తుగా చరిత్రలో నిలిచిపోతుంది.నంద్యాల మున్సిపాలిటీలో హస్తవాసి బాగా ఉంటేనే ఏ పనులైనా జరుగుతాయనడానికి సందేహం లేదనిపిస్తుంది.వైసిపి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల పనులు చేశారు. రోజులు, సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్ల కు బిల్లులు రాక కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.మరి కొన్ని ప్రాంతాల్లో బిల్లులు ఎక్కించడానికి, మంజూరు చేయడానికి 5 శాతం మామూళ్లు తీసుకొని బిల్లులు ఒకే చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.బిల్లులు కోసం అప్పటి మున్సిపల్ మినిస్టర్ను కాంట్రాక్టర్లు కలిసిన ప్రయోజనం కనిపించలేదు.ఎన్నికల ముందు కాంట్రాక్టర్లు చిన్న పని సైతం చేయకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చింది.ప్రభుత్వాలకు మంచి పేరూ రావాలంటే అభివృద్ధి చూసి ప్రజలు ఓటు వేస్తారు.ఈ నేపథ్యంలోనే గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్ల ముఖాల్లో ఆశలు చిగురించాయి.రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లు అందరూ తమ సమస్యలు మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు.గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు అన్ని నిధి పోర్టల్ లో ఎక్కించాలని అన్ని కార్పొరేషన్లు,మున్సిపాలిటీలకు ఆదేశాలు మంత్రి ఇచ్చారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నీ అన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు నిధి పోర్టల్ లో ఎక్కిస్తున్నారు.నిధి పోర్టల్ లో ఎక్కించిన బిల్లులను ఆధారంగా ప్రభుత్వం విడతలవారీగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు. అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న సామెతలా మంత్రి ఆదేశాలు ఇచ్చినా నంద్యాల మున్సిపాలిటీలో పెండింగ్లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు నిధి పోర్టల్ లో ఎక్కించకపోవడంలో మతలబ్ ఏంటో అర్థం కాని పరిస్థితి.నంద్యాల పట్టణంలో 2023 లో కాంట్రాక్టర్లు దాదాపు 6 కోట్ల పనులు చేసినట్టు సమాచారం.మున్సిపల్ అధికారులను సంబంధిత కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు నిధి పోర్టల్ లో ఎక్కిస్తే మా బాధలు తీరుతాయని కోరినా ఫలితంలేకుండా పోయింది.గతంలో చేసిన పనులను పరిశీలించిన తర్వాత ఆలోచన చేస్తానని చెప్పినట్టు తెలుస్తోంది. పనులు పరిశీలించాలని చెపుతున్నారా...హస్తవాసి బాగా ఇవ్వాలని చెప్పకనే చెబుతున్నారా అనే విషయం అర్థం కాని విషయం.గతంలో నంద్యాల మున్సిపాలిటీలో దాదాపు 50 మంది కాంట్రాక్టర్లు ఉండేవారు.పనులు చేసిన బిల్లులు రాకపోవడంతో చాలా మంది కాంట్రాక్టర్లు మున్సిపాలిటీ పనులు మాకొద్దు బాబోయ్ అంటూ పనులు చేయడమే మానేశారు.కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ముందుకు సాగుతుంటే నంద్యాలలో మాత్రం అధికారుల ప్రవర్తన ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే పరిస్తితిలో ఉన్నట్టు కనపడుతుంది.మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో కాంట్రాక్టర్ల బాధలు వర్ణనాతీతం. అధికారుల మొండి వైఖరి విడనాడి కాంట్రాక్టర్ల బిల్లులు ఎక్కించి ఆదుకుంటారని ఆశిద్దాం. అధికారులు బిల్లులు ఎక్కించకపోతే మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ,జిల్లా మంత్రులు ఎం.ఎం.డి.ఫరూక్, బిసి.జనార్ధన్ రెడ్డి,పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి నీ కలిసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధం అవుతున్నట్టు సమాచారం.అధికారులు ఇప్పటికైనా కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తారని ఆశిద్దాం.నూతన కమిషనర్ శేషన్న అయినా కాంట్రాక్టర్ ల సమస్యలు పరిష్కరిస్తారని ఆశిద్దాం.

# వికలాంగులు, వృద్ధుల కోసం జిల్లాలో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:** వికలాంగులు మరియు వృద్ధులకు అవసరమైన సహాయాలు, ఉపకరణాలు, సాయపరికరాలు ఉచితంగా అందించేందుకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలు నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి చొరవతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎడిట్ పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 26వ తేదీ నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో, 28వ తేదీ నందికొట్కూరు మండల పరిషత్ కార్యాలయంలో, జులై 1వ తేదీ ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 4వ తేదీ ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 8వ తేదీ బనగానపల్లి మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 11వ తేదీ డోన్ మండల పరిషత్ కార్యాలయంలో, జూలై 15వ తేదీ పాణ్యం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిబిరాలు ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడతాయన్నారు. ఈ శిబిరాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక నిపుణులను తక్షణమే నియమించాలని అలీ మీకో ప్రతినిధులకు సూచించామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# డాక్టర్. బి.ఆర్ . అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల దరఖాస్తులు



**కర్నూలుజూన్ 19 ఆంధ్ర ప్రగతి** ఉమ్మడి జిల్లాలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం ధరఖాస్తులు కోరబడుచున్నవి. తరగతి ఖాళీల వివరముల ను మీ దగ్గరిలో గల డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు %ఐజూ% కార్యాలయము నందు చూసుకోనగలరు. పరీక్ష నిర్వహించు తేదీ ఈ నెల 25వ తేదీ 25 జూన్ 2025 న బాలికలకు దిన్నెదేవరపాడు పాఠశాల నందు బాలురకు చిన్నటేకూర్ కళాశాల నందు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్, ఆం. ప్ర. సాం.సం. గు. వి. సంస్థ, డా. ఐ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.మరింత సంచారము కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 08518 295601

# రోడ్డుప్రమాదంలో డీఐపిఆర్ సిబ్బంది బి.నాగరాజు మృతి - కలెక్టర్ సంతాపం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:** మిడుతూరు మండలం రోళ్లపాడు మలుపు వద్ద గురువారం ఉదయం 5-30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయపు ఆఫీస్ సబార్డినేట్ బి. నాగరాజు హఠాన్మరణం చెందారు. ఈ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేసారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించాలని డిపిఆర్ఓ, నందికొట్కూరు తాసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. డిఐపిఆర్ఓ కార్యాలయపు సిబ్బంది కూడా నాగరాజు మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సంతాపాన్ని తెలిపారు.

# మస్కట్‌లో చిక్కుకుపోయిన మహిళను సురక్షితంగా చేర్చిన నంద్యాల జిల్లా పోలీసులు.

**- ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్.**



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ క్రైమ్ జూన్ 19:** కొద్ది రోజుల క్రితం, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా,కి మస్కట్‌లో ఉన్న చాగలమర్రి గ్రామానికి చెందిన హుస్సైనమ్మ అనే మహిళ ఒక సెల్ఫీ వీడియోను పంపింది. ఆ వీడియోలో ఆమె తీవ్రమైన మనస్తాపంతో తాను ఇక బతకలేనని, తనను కాపాడాలని వేడుకున్నారు.ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యతతో పరిగణించిన జిల్లా ఎస్పీ గారు వెంటనే ఆళ్లగడ్డ పోలీసులను అప్రమత్తం చేసి, ఆమెకు సంబంధించిన వివరాలు సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ పోలీసులు చేపట్టిన విచారణలో, హుస్సైనమ్మ భర్త 2024లో మరణించడంతో కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఆమె మస్కట్ వెళ్లినట్టు తెలిసింది.మొదట ఆమె ఓ ఇంట్లో మేడిగా పనిచేశారు. అయితే ఆ ఇంట్లో వంట చేస్తుండగా ఆమె నైటీకి నిప్పంటింది. ఈ ఘటనలో ఆమె కడుపు భాగానికి గాయమవడంతో తాను పనిచేయలేకపోయారు. పనికి వెళ్లలేని స్థితిలో, యజమాని ఆమెను తొలగించారు. అనంతరం ఆమె ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినా శరీరానికి బాధ ఉండటంతో ఎక్కడా ఉద్యోగం లభించలేదు. దీనివల్ల ఆమె ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణించింది. ఈ విషయంలో అలర్ట్‌గా స్పందించిన ఆళ్లగడ్డ పోలీసులు సంబంధిత ఏజెంట్లతో, మిగిలిన వ్యక్తులతో సంప్రదించి ఆమె కోసం విమాన టికెట్లను బుక్ చేయించారు. సమాచారం అందిన 48 గంటలలోనే ఆమెను గుర్తించి, తిరుగు ప్రయాణ ఏర్పాట్లు చేసి, చాగలమర్రిలో ఆమె కుటుంబానికి సురక్షితంగా చేర్చారు. ఈ ఘటనపై నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, మార్గనిర్దేశంలో ఆళ్లగడ్డ పోలీసులు చూపిన శీఘ్ర స్పందన మరియు చక్కటి నిర్వహణ మహిళల రక్షణ పట్ల నంద్యాల జిల్లా పోలీసుల కమిట్మెంట్ స్పష్టంగా చాటుతోంది.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:** ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేలా జిల్లా అధికారులు సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న యోగ ప్రదేశాల రిజిస్ట్రేషన్ లను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి యోగా శిక్షకులను కూడా కేటాయింపు చేయాలన్నారు. అన్ని గ్రామ, మండల, మున్సిపల్, జిల్లా ప్రదేశాల్లో ఉ.6:30గం.లకు అందరూ హాజరై, ఫోటోలు తీసేలా చూడాలన్నారు.

యోగ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు అందజేయాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారులు సంబంధిత కార్యాలయపు సిబ్బంది అందరూ కూడా యోగ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు. యోగా శిక్షణా ఇచ్చిన గురువులకు సర్టిఫికెట్స్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలు, కళాశాలలోని విద్యార్థులందరూ యోగా కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా చూడాలని డిఈఓ, డివిఈఓ లను కలెక్టర్ ఆదేశించారు. టేక్కే మార్కెట్ యార్డులో 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అవసరమైన చేయాలని నంద్యాల ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్ లను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ 21వ తేదీన అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ట్రయల్స్ రన్ నిర్వహించి పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం వెన్యూ రిజిస్ట్రేషన్స్, పూరైన ట్రైనింగ్స్, ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనండి.

**-21వ తేదీ టేక్కె మార్కెట్ యార్డులో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమాలు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:** ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని టేక్కె మార్కెట్ యార్డులో పండుగ వాతావరణంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 6-45 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. యోగాంధ్ర యాప్ లో నమోదైన దాదాపు 8 లక్షల మంది పౌరులు కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపల్ పట్టణాలు, జిల్లా స్థాయిల్లో యోగాంధ్ర వెన్యూలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాలలోని విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా సంబంధిత విద్యాసంస్థల ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా యోగంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ నెల 21వ తేదీన నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డులో దాదాపు 5,000 మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జిల్లాను ముందంజలో ఉంచేలా చూడాలన్నారు. అత్యధిక శాతం ప్రజలు భాగస్వామ్యం కావడం ద్వారా మన రాష్ట్రానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం దక్కే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తదితరులు పాల్గొంటారన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేసి ఒత్తిడిని తగ్గించుకుంటూ, మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. జీవితంలో యోగాని భాగం చేసుకోవాలని, నిత్యం యోగాను ఆచరించి ఆరోగ్యాన్ని బాగుపరచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు అందరూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇంట్లో అందరి పిల్లలకూ 'తల్లికి వందనం..

# తల్లిదండ్రుల్లో ఆనందోత్సాహం.!

**-టీడీపీ ప్రభుత్వాలతోనే విద్యకు ప్రాధాన్యం. -టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**









**ఆంధ్ర ప్రగతి గోస్పాడు జూన్ 19:** తల్లికి వందనం పథకం అమలుతో పేద విద్యార్థుల ఇళ్లలో ఆనందం వ్యక్తమవుతోందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామం నందు థాంక్యూ సీఎం సార్ అంటూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం తల్లి అకౌంట్లో పడిన 13 వేల రూపాయల డబ్బులను తల్లిదండ్రులకు స్వయంగా ఫిరోజ్ అందజేశారు .ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో, జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులకే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ముఖ్యమైన తల్లికి వందనం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు . ముందుగానే చెప్పిన విధంగా పాఠశాలలు ప్రారంభం రోజున ఈ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేశామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున రూ.8,745 కోట్లను నేరుగా వారి తల్లుల ఖాతాలో జమచేశామన్నారు. మిగిలిన రూ.2 వేలు చొప్పున రూ. రూ.1,346 కోట్లను పాఠశాలల అభివృద్ధికి కేటాయించామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్న ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని ఎన్ఎండి ఫిరోజ్ వెల్లడించారు. ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, అయిదుగురుంటే రూ.65 వేలు తల్లుల ఖాతాలో జమ చేశామన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు కు, మంత్రులు నారా లోకేశ్ , ఎన్ఎండి ఫరూక్ కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం జూలేపల్లె గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ చదివే విద్యార్థిని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర బ్యాగ్ లను అందజేయడం జరిగింది .

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సలిపెల ఓబుల్ రెడ్డి , గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , భాస్కర్ రెడ్డి , జి మనోహర్ రెడ్డి ,ఎం.సుబ్బారావు రెడ్డి , రవి , మహేష్ , ఫరూక్ హుస్సేన్ , మనోహర్ , సుబ్బయ్య మరియు గోస్పాడు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీకి సేవలందించిన

# ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం చేస్తాం.!

**మార్కాపురం నియోజకవర్గ పరిశీలకులు ఎన్ఎండి ఫిరోజ్.**






**ఆంధ్ర ప్రగతి మార్కాపురం జూన్ 19:** మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కాపురం నియోజకవర్గ స్థానిక సంస్థల పరిశీలకులు ఎన్ఎండి ఫిరోజ్ హాజరవ్వడంతో వారికి మార్కాపురం నియోజకవర్గం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ గారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ అని, సాధారణ కార్యకర్తలను రాష్ట్ర నాయకులు గా తీర్చిదిద్దే పరిశ్రమ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. దేశంలో ఏ పార్టీకిలేనంత బలం తెలుగుదేశం పార్టీకీ ఉందని, కోటి మంది క్రియాశీలక కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీ అగ్రస్థానంలో ఉందన్నారు. కడపలో అంగరంగా వైభవంగా జరిగిన మహానాడు విజయవంతంగా పూర్తి కావడంతో ప్రస్తుతం పార్టీ సంస్థగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందన్నారు.తెలుగుదేశం పార్టీకి సేవాలాందించిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని అందరికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి గా విజయవంతంగా అమలు చేస్తూ అన్న క్యాంటిన్లు, తల్లికి వందనం, రాజధాని అమరావతి పునర్నిర్మాణం, రాష్ట్రన్ని గుంతలు లేని రోడ్లుగా మార్చడం వివిధ సంక్షేమ పథకాల అమలు చేయడంతో రాష్ట్ర ప్రజల ఆధారాభిమానాలను తెలుగుదేశం పార్టీ దూసుకుపోతుందన్నారు. అదే విధంగా రాబోయే మార్కాపురం నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ఆదరణతో అన్ని స్థానాల్లో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషితో 100% గెలిచేలా కృషి చెయ్యాలని ఈ సందర్భంగా తెలిపారు. టీడీపీ పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారికీ హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ కందుల రామ్ రెడ్డి, ప్రకాశం జిల్లా సెక్రటరీ తాళ్లపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకట్ రెడ్డి , పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి , మైనార్టీ సీనియర్ నాయకులు పటాన్ హుసేన్ ఖాన్ , కౌన్సిలర్లు షరీఫ్ , కరీం సాబ్ , మహబూబ్ బాషా , మయూరి కాసిం , పఠాన్ గులాబ్ ఖాన్ , సయ్యద్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ కార్యక్రమం నుండి ఆగ్రహంతో వెళ్లిపోయిన జెసి.




**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 19:** యోగ కార్యక్రమం ప్రారంభం నుండి జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ఆగ్రహంతో వెళ్లిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. మహానంది, సిరివెళ్ల అటవీ సమీప గ్రామమైన పచ్చర్లలో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమంలో జెసి పాల్గొనాల్సి ఉంది. అక్కడ ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడి నుండి వెళ్లిపోయినట్లు తెలుస్తుంది. జెసి కార్యక్రమానికి హాజరైన సందర్భంగా అక్కడ తూతూ మంత్రంగా అతి కొద్ది మంది మాత్రమే ఉండడంతోపాటు సచివాలయ సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడంతో పై స్థాయి అధికారులు అయినా మీరు ఏమి ఉద్యోగం చేస్తున్నారు ఇలాగైతే మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు అని ప్రశ్నిస్తూ తీవ్రంగా మందలించినట్లు సమాచారం. నంద్యాల మున్సిపాలిటీ యోగ కార్యక్రమానికి అవసరమయ్యే 2 వేల మ్యాట్ లను కొనుగోలు చేసిందని వాటిని యోగ కార్యక్రమంలో భాగంగా వినియోగించుకోవలసి ఉన్న కూడా నిర్లక్ష్యంగా పచ్చర్లలో ఏర్పాట్లు విఫలం కావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడ ఆ కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయినట్టు తెలుస్తుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగ కార్యక్రమాన్ని క్రింది స్థాయి అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై ఎవరిపై ఎలాంటి చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారు అనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ఆదోని ఎమ్మెల్యే పార్ధసారథి పై

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

**-కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నందు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి డౌన్ డౌన్ అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈనెల 16న ఆదోని లో అధికారికంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్సీ సర్పంచ్ చంద్రశేఖర్ను వేదికపైకి పిలవకుండా అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పైన అలాగే టిడిపి మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకుడు గుర్రం మనోహర్ డిమాండ్ చేశారు,ప్రోటోకాల్ ప్రకారము ఆ యొక్క గ్రామంలో అధికారికంగా ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన ఆ గ్రామ సర్పంచును పిలవాలి, అయితే వేదికపైకి పిలిచే సమయంలో వీడు ఎస్సీ నా అయితే వేదిక మీదకు వద్దు అని అవమానించడం చాలా బాధాకరమని అన్నాడు,ప్రజలు ఇప్పటికైనా గమనించాలి బిజెపి పార్టీ దళితులను ఎప్పటికీ ముందుకు రానీయదు,దళితులు అంటే అంటరాని వాళ్ళు అని బిజెపి యొక్క మనుధర్మ శాస్త్రంలో ఉన్న పద్ధతిని పాటించడమే బిజెపి లక్షణం,, అందుకే ఎస్సీ అయితే వేదిక మీదకు పిలవకండి అని చెప్పడం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కి ఇది ఒక అహంకార ధోరణి అని వారు అన్నారు, కాబట్టి తక్షణమే కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పైన చర్య తీసుకోవాలని వారు అన్నారు ఇలాంటి ఘటనలు బిజెపి పరిపాలించే రాష్ట్రాలలో అధికంగా ఉన్నాయని వారు అన్నారు, ఇప్పటికే బీజేపీ పార్టీ దళితులను అంటరాని వారిగా చూస్తూ వారి ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది, బిజెపి పాలించే రాష్ట్రాలలో దళితులపైన అనేక రకాల దాడులు కొనసాగిస్తుంది,కాబట్టి బిజెపి పార్టీ దళితులను మోసం చేసే నాశనం చేసే పార్టీ కాబట్టి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత సంఘాలు ఏకమయి ఇటువంటి ఘటనలను వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బయటిపేట కెవిపిఎస్ నాయకులు మధు,కళ్యాణ్,చరణ్,కొండయ్య, జగన్ గుల్లి,చైతన్య, వై చరణ్,సుమ్మన్న,తదితరులు పాల్గొన్నారు.

## దళిత సర్పంచు ను అవమానించినవారి పైన తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 19:** ఆదోని మండలం దానాపురంలో దళిత సర్పంచును అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, తెలుగుదేశం నాయకులు గుడిసె కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ తిమ్మన్న. చిన్నప్పలు, డిమాండ్ చేశారు. ఆదోని మండలం పరిధిలోని దనాపురం గ్రామంలో 16.06.25న సోమవారం సాయంత్రం కూటమి ప్రభుత్వ సంవత్సర పాలనకు సంబరాలు జరుపుకుంటూ.. వీధుల్లో తిరుగుతూ నడి వీధిలో గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్ ను అవమానించడం బాధాకరమన్నారు. ఆ సభ దగ్గర ఎమ్మెల్యే పార్థసారథి సభను ప్రారంభించి మాట్లాడే మధ్యలో గ్రామ సర్పంచ్ ను పిలవడమనేదే అవమానించడం అన్నారు. వేదికపైనే సర్పంచ్ కుల ప్రస్తావన చేస్తూ.. ఎస్సీ కాబట్టి వేదికపైకి రాదు అని టిడిపి పార్టీ రాష్ట్ర నాయకులు గుడిసె కృష్ణమ్మ చెప్పడం, దానికి ఎలాంటి రియాక్షన్ లేకుండానే ఎమ్మెల్యే మిన్నకుండటం వివక్షను ప్రోత్సహించడం తప్ప వేరే కాదన్నారు. దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్ వేదిక దగ్గరికి వచ్చినా పైకి పిలవకుండా కిందే నిలబెట్టి మాట్లాడడం అంటరానితనాన్ని అక్షరాల పాటించిన దానికి సంకేతం అన్నారు. సంవత్సర పాలనలో ఏం సాధించారో తెలియదు కానీ, రాజ్యాంగ హక్కులను గౌరవించి, సాటి మనిషిని మనిషిగా చూడటాన్ని నేర్చుకోవాలని హితువుపలికారు. ఆదోని ఎమ్మెల్యే రోజువారీగా గట్టిగా మాట్లాడే వట్టి మాటలను కట్టిపెట్టి, ఆదోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంటరానితనాన్ని అంతమొందించాలన్నారు. ఈ సమావేశంలో చర్మ కళాకారుల సంఘం జిల్లా నాయకులు సుమల అంతోని. కెవిపిఎస్ మండల కార్యవర్గ సభ్యులు రాజా రమేష్ ఉపాధ్యక్షులు సుమాల రాజు ఎన్ గుంటప్ప ఎస్ రాముడు మనోహర్ ఎం రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం

# వచ్చే వరకు పోరాటం ఆగదు.

**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:** సిపిఐ పట్టణ శాఖ కార్యదర్శుల సహాయ కార్యదర్శుల సమావేశం సాయిబాబా నగర్ లో ఉన్న స్వామి రెడ్డి భవన్( సిపిఐ కార్యాలయంలో) భూమని శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రి స్వామి హాజరైనారు.

అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ పట్టణంలోని వార్డులలో అనేక సమస్యలతో ఇబ్బందులకు గురి అవుతున్నారు ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉంటూ బాడుగలు కట్టలేక బాధపడుతూ ఉంటారు సొంత ఇల్లు ఉన్నవారు ఒక్కొక్క ఇంట్లో రెండు మూడు సంసారాలు ఉంటూ కాలం వెళ్ళబుచుకుంటూ ఉంటారు అలాంటి వారిని గుర్తించి సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నాలుగు దపాలుగా సిపిఐ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో సచివాలయాల దగ్గర ఎమ్మార్వో కార్యాలయాల దగ్గర అర్జీదారులతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి వ్యక్తిగత అర్జీలు ఇప్పించడం జరిగింది.

కానీ ప్రభుత్వం తరపునుండి ఎటువంటి ముందడుగు కనపడడం లేదు అందుకని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేవరకు పోరాటాలు ఆగవని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు బిబి సరస్వతి నారాయణమ్మ పట్టణ సిపిఐ శాఖ కార్యదర్శులు సహాయ కార్యదర్శులు యం హబీబ్ బేగ్ సాల మద్దిలేటి మద్దయ్య సుబ్బరాయుడు సెక్ష దానం సిద్ధిక్ శీను దస్తగిరి చాంద్బాషా ఓబులేసు రమేష్ అబ్దుల్లా మా భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 20 జూన్ 2025

# సంస్థా గత కమిటీల ఎన్నిక ప్రజాస్వామ్య విదానంలో జరగడం టిడిపికే సాధ్యం..!

**ఎమ్మిగనూరు నియోజకవర్గ సంస్థాగత కమిటీల అబ్జర్వర్ ఏవి సుబ్బారెడ్డి**




**ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జూన్ 19:** తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల ఎన్నిక విధానం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని ఎమ్మిగనూరు నియోజకవర్గ సంస్థాగత కమిటీల అబ్జర్వర్ సీనియర్ టిడిపి నాయకులు ఏవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు నాయుడు మరియు ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం సంస్థ గత ఎన్నిక కమిటీల అబ్జర్వర్ గా సీనియర్ టిడిపి నాయకుడు ఏవి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ప్రజాస్వామ్య విధముగా సంస్థాగత ఎన్నిక కమిటీలను ఏర్పాటు చేయడం ఒక టిడిపి పార్టీకే సాధ్యమని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ పదవులు దక్కుతాయని పేర్కొన్నారు. వైసిపి కుట్రలో భాగంగా టిడిపి పార్టీలోకి కోవర్ట్ లను పంపిస్తున్నారని స్థానిక నాయకులు గుర్తించి తగిన విధంగా స్పందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుపరిపాలన కొనసాగుతున్నదని సూపర్ సిక్స్ పథకాల అమలుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇంకా కూటమి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు అధికారంలో ఉంటుందని ఈ నాలుగు సంవత్సరాల కాలంలో స్వర్ణాంధ్రప్రదేశ్ ఆరోగ్యాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు.

# ప్రవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు దోపిడీని అరికట్టాలి.

**-రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బందేల ఓబులేసు డిమాండ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:**
విద్యా సంవత్సరం ప్రారంభం అవడమే ఆలస్యం పుస్తకాల అమ్మకాలకు నిలయాలుగా మారుతున్నాయి.విద్యా వ్యాపారంగా ,ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యజామాన్యాల తీరు మోసపూరితంగా ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా విద్యార్థల నుండి వేలకు వేలు లక్షల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి దండుకుంటున్నారు.అలాగే విద్యా హక్కు చట్టం అనేది వారికి వర్తించనట్టు వ్యవహరించడం వారికి అలవాటైందని ఆయన అన్నారు.జూన్ విద్యా సంవత్సరం మొదలైన రోజు నుండి నేటి వరకు మండల విద్యాధికారులు గాని జిల్లా విద్యాధికారులు గాని ఇప్పటి వరకు ప్రయివేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు దోపిడీ అలాగే పాఠశాల లో పుస్తకాలు అమ్మకాలు జరుగుతుంటే తనిఖీలు చేయకపోవడం వారి నిర్లక్ష ధోరణికి ఇదే ఉదాహరణ,అని ఆయన అన్నారు. మా మూళ్ల మత్తులో విద్యాశాఖాధికారులు తీరు స్పష్టంగా ఉందని ,అంతేకాకుండా కనీసం సౌకర్యాలు లేకున్న వేలకు వేలు అలాగే లక్షలరూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులను విద్యా సంస్థల యజామాన్యాలు జలగలాగా పీల్చుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అందుచేత విద్యార్థుల భవిష్యత్తు ను కాపాడాలాని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్థున్నామని, అంతేకాకుండా భవిష్యత్తు లో విద్యార్థుల సమస్యలపైన రాజిలేని పోరాటాల కు సిద్ధం కావాలని రాయలసీమ స్టూడెంట్స్ అస్సోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బందేల ఓబులేసుఈ సమావేశానికి అన్ని విద్యార్థి సంఘాల నాయకులు అందరు ఫాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ఆత్మకూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ.

**సరైన పత్రాలు లేని 30 మోటార్ సైకిళ్ళు,అక్రమ మద్యం 15 క్వాటర్ బాటిల్లు స్వాధీనం.**

**ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ.**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక.**

**ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ రాము.**




**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూన్ 19:**
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ సూచనలతో ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో వారి సిబ్బంది బృందాలుగా ఏర్పడి నేటి తెల్లవారుజామున కరివేన,వెంగల్ రెడ్డి నగర్ నందు నేర నియంత్రణ మరియు శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ఆపరేషన్లు నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా కరివేన, వెంకటరెడ్డి నగర్ నందు గ్రామంలో రౌడీ షీటర్లు మరియు అనుమానితులు, నేర చరిత్ర గల వారి నివాసాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సోదాలలో 15 క్వార్టర్ బాటిళ్ళు మరియు సరైన ధ్రువపత్రాలు లేని 30 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది.ప్రజల భద్రత కోసం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ ఆపరేషన్లు చేపట్టడం జరిగింది.అనంతరం కార్డెన్ అండ్ సర్చ్ చేసిన గ్రామాలలోని ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు మొదలగు వాటిపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించడం జరిగింది.

# వ్యక్తిని సమున్నతంగా మార్చే శక్తి యోగాకు ఉన్నది.

**-కె. వి. సతీశ్ కుమార్ రెడ్డి నగరపాలక సహాయ కమిషనర్.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూన్ 19:**
వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి యోగ ఎంతగానో తోడ్పడుతుందని, ప్రతి వ్యక్తిలో నిద్రాణమైఉన్న శక్తులను మేల్కొల్పి, తనను తానుగా నిరూపించుకునే విధంగా ముందుకు తీసుకుపోగల శక్తి యోగాకు ఉన్నదని, అందుకే ప్రపంచ దేశాల మేధావులందరుకూడా యోగాను అభ్యాసం చేస్తున్నారని, యోగపై అనేక పరిశోధనలు కూడా జరుగుతున్నాయని, నగరపాలక సహాయ కమిషనర్ కె.వి. సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.తాండ్రపాడు నందున్న ది క్రెడో పాఠశాల నందు ఏర్పాటుచేసిన సామూహిక యోగాసనాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో సామూహిక యోగా కార్యక్రమాలను ఏర్పాటు నిర్వహిస్తున్నదని, కర్నూలునందు ది క్రెడో పాఠశాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ది క్రెడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్య కార్తీక్, లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, యోగా మాస్టర్ అనంత అనిల్ కుమార్, ధార్మిక ప్రవచకులు జి. బలరామాచార్య, వెల్దుర్ది హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపకులు రామాంజనేయులు స్వామి, లక్ష్మి రెడ్డి, పాఠశాల బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. యోగా మాస్టర్ అనంత అనిల్ విద్యార్థులందరితో సూర్య నమస్కారాలు తదితర యోగాసనాలు అభ్యాసం చేయించారు.

# మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం.



**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 19:**
ఎన్నికలకు ముందు మహిళలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలుపరచడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నాయకురాలు షేమిమ్ బేగం ఆరోపించారు. గురువారం కొండపేట కాలనీలో ఐద్వా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐద్వా నాయకురాలు షేమిమ్ బేగం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడచిన మహిళలకు ఇచ్చిన హామీలు ఉచిత బస్సు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని, 50 సంవత్సరాలు నిండిన వారందరికీ పెన్షన్లు అందిస్తానని హామీనిచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా అమలుపరచడంలో మీనమేషాలు లెక్కించడం సమంజసం కాదని వారన్నారు. రాష్ట్రంలో చాలామంది మహిళా యువతులు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉన్నది ఉద్యోగాలు కల్పించిన యెడల ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నిరుద్యోగి తక్షణమే 3వేల రూపాయల నిరుద్యోగ భృతి హామీని అమలు పరచాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళ హెూం మంత్రి ఉండి మహిళలకు ఎటువంటి రక్షణ కానీ భద్రత కానీ లేదని ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మహిళలపై దాడులు అత్యాచారాలు జరుగుతున్న మహిళా హెూం మంత్రి చూస్తూ ఉండటం ఏమిటని వారు ప్రశ్నించారు 40 సంవత్సరాల రాజకీయ మేధావుని అంటూ ప్రతి సభలో ఉదరగొడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనలు జరుగుతున్నాయంటే ఈ రాష్ట్రంలో మహిళలకు ఎటువంటి భద్రత రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందో అర్థమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుపరిచి రాష్ట్రంలోని మహిళలకు అన్ని విధాల భద్రత రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కొండపేట శేగు టాకీస్ ఏరియా ఐద్వా నూతన శాఖ కమిటీ అధ్యక్షులుగా సువర్ణ,ఉపాధ్యక్షులుగా జయలక్ష్మి,కార్యదర్శిగా చాముండేశ్వరి,సహాయ కార్యదర్శిగా కమలమ్మ, ట్రెజరరీగా రేష్మాలతో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో ఐద్వా నాయకురాలు సూర్య పద్మమ్మ మౌలాబి విజయలక్ష్మి షబానా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల లోగిళ్లలో యోగాసనాలు,



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూన్ 19:
యోగాంధ్రలో భాగంగా గురువారం శిరివెళ్ల మండలం నల్లమల నట్టడివిలో ప్రకృతి సోయగాలు అడవి తల్లి అందాల మధ్య జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు విద్యార్థిని విద్యార్థులు యోగ ఆసనాలు చేశారు.ఊటీవరకూ వెళ్లలేనివారికి, కొడైకెనాల్ కోరిక తీరనివారికి సూక్ష్మంలోనే పర్యాటక మోక్షం.. నల్లమల అడవి ప్రాంతం. ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్న అడవి తల్లి ఒడిలో యోగ ఆసనాలు చేసి మంచి అనుభూతిని పొందినట్లు అయ్యింది. పచ్చర్ల లో ఏపీ టూరిజం ఏ సి కాటేజీలు ఆకర్షిస్తాయి నల్లమలలో మయూరాల నాట్యాలు, లేడి కూనల పరుగులు, రకరకాల పక్షుల కువకువలు, పులుల గాండ్రిపులు.. ప్రత్యక్షంగా అనుభూతి చెందాలంటే నల్లమల అందాలు తిలకించాల్సిందే. దారి పొడవునా పచ్చని చెట్లు, వంపులు తిరిగిన రోడ్డు, ఎత్తయిన కొండలు, పాతాళానికి దారిచూపేలా ఉన్న లోయలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తాయి. సీతాకోక చిలుకలు సాదర స్వాగతం పలుకుతాయి.ఇక్కడి సెలయేటి సవ్వడులు పరుగులు పెట్టే జల పాతాలు విశేషంగా ఆకట్టుకుంటూ. కొత్త అనుభూతుల్ని పంచే నల్లమల ఒడిలో యోగ ఆసనాలతో విన్యాసాలు చేసి స్వచ్ఛమైన ప్రకృతి అందాల మధ్య శ్వాస పై ధ్యాస ఉంచి నల్లమల అడవి తల్లి ఒడిలో గాలి పీల్చి యోగ ఆసనాలు చేసిన ప్రతి ఒక్కరూ కొత్త అనుభూతికి లోనయ్యారు.

# టిడిపికి కార్యకర్తలే పునాది

**-టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి.**

**-సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని పిలుపు.**



**ఆంధ్ర ప్రగతి గుంతకల్లు జూన్ 19:**
తెలుగువారి ఆత్మగౌరాన్ని కాపాడటం కోసం పుట్టిన పార్టికి, టిడిపి కార్యకర్తలే పునదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్, అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజక వర్గ పరిశీలకులు తాతిరెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజక వర్గ కేంద్రంలో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎంఎల్యే గుమ్మనూరు జయరాం అధ్వర్యంలో జరిగిన సంస్థాగత ఎన్నికల నిర్వహణ, పార్టి బలోపేతం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా తులసి రెడ్డి మాట్లడుతూ..దివంగత నేత ఎన్టిఆర్ ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీని స్తాపించారని అయన గుర్తు చేశారు. ప్రజల కోసం తెలుగు దేశం పార్టి పుట్టిందని చెప్పారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చందబాబు కృషి చేస్తున్నరని ఆయన చెప్పారు. పార్టిని గ్రామ స్థాయి నుంచి పట్టణ, జిల్లా స్థాయి వరకు బలోపేతం చేసే బాద్యత మనందరిపై ఉందన్నారు తులసి రెడ్డి. కుటుంబ సాదికరిక సారధులు పార్టి కోసం కృషి చేయాలని సూచించారు. అలాగే, తమ కూటమి ప్రభుత్వం పై జరుతున్న తప్పుడు ప్రచారాల పట్ల, నేతలు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని, విపక్ష వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్, అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజక వర్గ పరిశీలకులు తాతిరెడ్డి తులసిరెడ్డి కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవర్చడంలో అప్పటి వైసిపి నేతలు మోసం చేశారని.. అందుకే ఆపార్టీకి రాష్ట్ర ప్రజలు కేవలం 11 సీట్లుకు మాత్రమే పరిమితం చేశారని తులసి రెడ్డి గుర్తు చేశారు. ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్దిని పరుగులు పెట్టిస్తున్నా చంద్రబాబు నాయక్వతంలో తెలుగుదేశం పార్టీని.. మరింత బలోపేతం చేసే బాద్యత టిడిపి కార్యకర్తలుగా మనందరి ఉందని ఆయన చెప్పారు. పార్టి కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని తులసి రెడ్డి చెప్పారు. సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకొని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇటింటా ప్రచారం చెయ్యాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్, అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజక వర్గ పరిశీలకులు తాతిరెడ్డి తులసిరెడ్డి కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# రైతన్నా నకిలీ విత్తనాలతో జరజాగ్రత్త..!



## రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు. రైతులను నిండా ముంచుతున్న నకిలీ విత్తన మాఫియా.

**నకిలీ విత్తనాలపై ప్రత్యేక కథనం**

ఆంధ్రప్రగతి నంద్యాల జిల్లా జూన్ 19:
ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం. చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ... రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా ?
వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యత పైనే పంట దిగుబడి నాణ్యత,, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి.

కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట, వరంగల్, షాద్ నగర్, ఆత్మకూర్ లలో వ్యవసాయ అధికారులు, పోలీసులు జరిపిన సోదాల్లో లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి, ప్రతి సంవత్సర ఇలాంటి సంఘటనలు కోకొల్లలు గా జరుగుతున్నాయి ,ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరాలి అవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు... మొలక వచ్చినా సరైన దిగుబడి రావడం లేదు%ౌ% చివరికి రైతులకు దిగుబడి నష్టం, అప్పుల భారంతో పాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉంది.

### నకిలీ విత్తనం అంటే ఏమిటి.?

నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వంలి గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి.

బినకిలీ విత్తనాలను గుర్తించడం ఎలా.?

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంట వేయకముందు రైతు నకిలి విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడాలు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటు కోవాలి.
విత్తనం వేయక ముందు నకిలీ విత్తనాలు గుర్తించడం ఎలా? రైతులకి మార్గదర్శక సూచనలు
వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి
ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి.ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గ చూపండి
విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హొలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి.

### తక్కువ ధర - అధిక నష్టం!

మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే మూటలపై మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు.
బిల్లు తప్పనిసరి!
విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.
బిప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించండి
ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే "పచ్చ రంగు ట్యాగ్" ( ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా "నీలి ట్యాగ్" (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించండి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చ ట్యాగ్ ఉండేలా చూస్తారు.
బిట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం
విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు.
బిమొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి.
ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80% కంటే ఎక్కువ, జన్యు శాతం 98% కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2% కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి.

**బీటీ విత్తనాల గుర్తింపు**
**జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి**

ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏ సి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం.
ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రాపత్రాలద్వారా న్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని కూడా రైతులు మర్చిపోకూడదు.

**పంట కాలంలో నకిలీ విత్తనాలను గుర్తించే సూచనలు**

విత్తనాలు మొలకెత్తకపోవడం %-% నాణ్యమైన విత్తనాలు సగటున 80-90% మొలకెత్తుతాయి. తక్కువ మొలకశాతం నకిలీ విత్తన సంకేతం కావచ్చు.
బి చెడ్డ మొలకలు %-% మొలకెత్తిన విత్తనాలు సరైన ఎదుగుదల కనబరచకపోవడం.
బిపూత రాకపోవడం లేదా పూత పూసి రాలిపోవడం %-% చివరికి కాయలుగా మారకపోవడం.
ఇలాంటి లక్షణాలు పంట సమయంలో గమనిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలి.
బిరైతులు నకిలీ విత్తనాలు ఎందుకు కొనుగోలు చేస్తున్నారు.?
బితక్కువ ధరకు లభ్యత
ఉచిత విత్తన బహుమతుల వంచనలు "మూడు కొనుగోలు చేస్తే ఒకటి ఉచితం" వంటి లౌకిక మాయాజాలాలు.
ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం %-% నకిలీ విత్తన వ్యాపారాలపై తగిన చర్యల లోపం.

### బిటి మరియు నాన్ బిటి ప్రత్తి విత్తనాలను గుర్తించడం ఎలా.?

బిటి ప్రత్తి విత్తనాల్లో జన్యుపరమైన మార్పులతో పురుగు నిరోధకత కలిగి ఉండటం వల్ల ఎక్కువ దిగుబడులు వస్తాయి. అయితే మార్కెట్లో బిటి పేరిట నాన్ బిటి విత్తనాలు కల్తీగా అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గుర్తింపు కోసం:
"బి టి క్రై 1 ఏ బి/ క్రై 1ఏ సి రాపిడ్ డిటెక్షన్ కిట్స్ అనే స్ట్రిప్ కిట్లు రైతులకు అందుబాటులో ఉన్నాయి.
రెండు గీతలు వస్తే - బిటి విత్తనం
ఒక గీత మాత్రమే వస్తే - నాన్ బిటి విత్తనం ఇలా 30 నిమిషాల్లోనే రైతులు తామే పరీక్షించగలుగుతారు.
బివిత్తన మొలక శాతం పరీక్షించే సరళమైన పద్ధతులు.
విత్తనం నాణ్యత తెలుసుకోవాలంటే మొలకశాతం పరీక్ష అవసరం. రైతులు ఈ క్రింది పద్ధతుల్లో ఈ పరీక్షలు జరుపవచ్చు.
ఒక ప్లాస్టిక్ ట్రే లో శుభ్రమైన ఇసుక వేయాలి100 విత్తనాలను వరుసగా వేయాలి (ప్రతీ వరుసకు 10 చొప్పున)నీరు జల్లుతూ 7%-%10 రోజుల పాటు చూడాలి
ఎన్ని విత్తనాలు మొలకెత్తాయో లెక్కకట్టి మొలక శాతం తెలుసుకోవాలి, 80% కంటే తక్కువ మొలక శాతం వస్తే:
విత్తన మోతాదును పెంచాలి లేదా వేరే కంపెనీ విత్తనాలు తీసుకోవాలి.
రైతులు పై సూచనలు పాటిస్తే కొంత వరకు అన్నా నకిలీ విత్తనాల బారిన పడకుండా అధిక దిగుబడులు పొందవచ్చు.

---

# జస్టిస్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు

## నిజమేనని తేల్చిన ముగ్గురు సభ్యుల ప్యానెల్

న్యూఢిల్లీ,:**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో డబ్బు బయటపడిన మాట నిజమేనని తేలింది. ఇల్లు కాలిన సమయంలో డబ్బుల కట్టలను గుర్తించారు. ఈ క్రమంలో ఇది వాస్తమే అని ముగ్గరు న్యాయమూర్తుల ప్యానెల్ నిర్ధారించింది. ఆయన దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న వేళ అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలను గుర్తించారు. దీనిపై ప్యానెల్ తాజాగా 60 పేజీల నివేదిక ఇచ్చింది. ఈ ఏడాది మార్చి 14న దిల్లీలోని జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి.. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఇది నిజమేనని ధ్రువీకరించిన త్రిసభ్య కమిటీ సంబంధిత నివేదికను సుప్రీంకోర్టుకు అందించింది. ఇందులో 30 తుగ్లక్ క్రిసెంట్ రోడ్డులోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నోట్ల కట్టలను గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. దీనికి ఆ సొమ్ములున్న స్టోరూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల అధీనంలోనే ఉందని అభిప్రాయపడింది. దీనికి సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అక్కడ అగ్నిప్రమాదంలో దగ్ధమైన నోట్లను మార్చి 15వ తేదీ తెల్లవారుజామున అక్కడినుంచి తొలగించడమే దీనికి బలమైన సాక్ష్యమని వెల్లడించింది. అసలు ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల స్టోరూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. తమకు లభించిన ఎలక్ట్రానిక్, ప్రత్యక్ష ఆధారాలను దృష్టిలో ఉంచుకొని సీజేఐ ఆరోపణలు నిజమేనని తేలుతోందని నివేదిక వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని అభిప్రాయపడింది. జస్టిస్ వర్మపై దర్యాప్తులో భాగంగా 10 రోజులపాటు 55 మంది సాక్షులను విచారించారు. వారి వాంగ్మూలాలను వీడియోలో చిత్రీకరించారు. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ కుమార్తె దియా, ఆయన ప్రైవేటు కార్యదర్శి రాజేందర్‌సింగ్ కార్కి తదితరులను కూడా ప్యానెల్ విచారించింది. అగ్నిమాపక సిబ్బంది తమ నివేదికలో నోట్ల వివరాలు నమోదు చేయకుండా రాజేందర్‌సింగ్ అడ్డుకొన్నట్లు తెలిసింది.

# ఇరాన్ అధినేత ఖొమేనీ హత్య సాధ్యమేనా?



టెహ్రాన్,**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హత్య చేయాలన్న ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకున్నట్లుగా ఇటీవల పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ చనిపోయిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ సైతం ఈ వార్తలను తోసిపుచ్చలేదు. సుప్రీం కమాండర్‌కు అనుకోని విధంగా ఏదైనా జరిగితే కొత్తగా బాధ్యతలు ఎవరు స్వీకరిస్తారనే చర్చ జరుగుతున్నది. ఇరాన్ రాజకీయాలు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ నిపుణులు మాత్రం ఖమేనీ కుమారుడు అతని తర్వాత సుప్రీం లీడర్‌గా వచ్చేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల 30 మంది ఇరానియన్ నిపుణులతో నిర్వహించిన బీబీసీ పర్షియన్ పోల్‌లో.. అయతుల్లా అలీ ఖమేనీ రెండో తనయుడు మోజ్‌తబా తన తండ్రి బాధ్యతలను చేపడుతాడని విశ్వసిస్తున్నట్లుగా తేలింది. కానీ, ఇరాన్ సొంత వ్యవస్థ అడ్డంకిగా మారే అవకాశం ఉంది. వంశపారంపర్య వారసత్వం ద్వారా అధికారాన్ని బదిలీ చేయాలన్న ఆలోచన 'ఇస్లాం వ్యతిరేకంగా' పేర్కొన్నారు. షాను తొలగించిన అయతుల్లా రుహోల్లా ఖమేనీ.. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది రాచరికం కంటే మెరుగైంది ఏమీ కాదన్నారు. ఈ విషయంలో ఆయన ఆలోచనలు ప్రసంగాలు, ఇతర రచనలను సేకరించిన 21-సంపుటాల సముదాయం సహిఫెయే ఇమామ్ ఖమేనీలో నమోదయ్యాయి. 1989లో ఖమేనీ తర్వాత సుప్రీం నాయకుడిగా మారిన ఖమేనీ.. వంశపారంపర్య పాలన ఇస్లామిక్ వ్యవస్థకు తగదని అన్నారు. ఇరాన్‌లో అయతుల్లా రుహోల్లా ఖమేని చిత్రం ప్రతిచోటా కనిపిస్తుంది. ఇరాన్ కరెన్సీ నోట్లు.. తరగతి గదులు.. ప్రభుత్వ భవనాల్లో ఆయన చిత్రం కనిపిస్తుంది. అహ్మద్ భారతదేశం నుంచి ఇరాన్‌కు వెళ్లారు. ఖమేనీ ఆ తర్వాత ఇరాన్ దేశ మొదటి సుప్రీం నాయకుడు అయ్యాడు. ఇరాన్‌ను దైవపరిపాలనా రాజ్యంగా మార్చాడు. అహ్మద్ తన భారతీయ మూలాలను ప్రతిబింబించడానికి 'హిందీ' అనే పేరును తన పేరులో కలిపి పెట్టుకున్నాడు. అహ్మద్ 1830లో బారాబంకీని వదిలి వెళ్లాడు. ఆయన తండ్రి దిన్ అలీ షా 1700లో మధ్య ఇరాన్ నుంచి భారతదేశానికి ప్రయాణించాడు. 1800 ప్రాంతంలో జన్మించిన అహ్మద్.. మొఘల్ సామ్రాజ్యం పతనం తర్వాత భారతదేశంలో బ్రిటిష్ నియంత్రణ పెరుగుతున్న సమయంలో లక్నో నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారాబంకీ సమీపంలోని కింటూరు గ్రామంలో పెరిగాడు. ఇస్లాంకు పునరుజ్జీవనం అవసరమని.. ముస్లింలు సమాజంలో తమ స్థానాన్ని తిరిగి పొందాలని నమ్మిన ముస్లిం ప్రముఖుల్లో ఒకడు. ఆయన షియా మత గురువు. 1800 ప్రారంభంలో భారతదేశం నుంచి ఇరాక్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో పర్షియా పేరుతో పిలువబడ్డాడు. 1830లో నజాఫ్‌లోని అలీ సమాధిని సందర్శించాడు. 1834 నాటికి ఇరానియన్ పట్టణమైన ఖోమిన్‌కు వెళ్లి ఒక ఇల్లు కొనుక్కున్నాడు. అక్కడే కుటుంబాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రయాణం తన మతంపై నమ్మకంతో దాన్ని వ్యాప్తి చేయాలనే కోరిక ఉండేది. ఖోమిన్‌లో ఆయన మూడుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో ఒకరు రుహోల్లా ఖోమినీ తండ్రి మోస్తఫా. ఆయన 1902లో జన్మించాడు. అహ్మద్ హిందీ 1869లో తుదిశ్వాస విడిచారు. ఖమేనీ పుట్టడానికి చాలా కాలం ముందే అహ్మద్ హిందీ మరణించినప్పటికీ.. కుటుంబ విలువలు, విశ్వాసం సుప్రీం లీడర్ ఖమేనీ ద్వారా ఇరాన్ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాయి.

# మన సంస్కృతిని మన భాషలోనే అర్థం చేసుకోగలం

## విదేశీ బాషలను దూరం పెట్టే రోజులూ వస్తాయి

### పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ,:**జూన్ 19 ఆంధ్ర ప్రగతి**
మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మాతృభాషలోనే దీనిని అర్థం చేసుకోగలమని అన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి మూలాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

# తిరుమలలో ఆర్టీసీ ఉచిత బస్సులు

## ప్రారంభించిన టిటిడి అదనపు ఇవో వెంకయ్య చౌదరి



తిరుమల**జూన్ 19 ఆంధ్ర ప్రగతి** ,: తిరుమలలో శ్రీవారి రథాలకు తోడు ఉచితంగా ఆర్టీసీ బస్సులను నడుపనుంది. భక్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల నుంచి ప్రైవేటు వాహనాల వారు అధికంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం.. తిరుమలలో బస్సులను ఉచితంగా నడిపేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇందుకు ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని వెల్లడించారు.

# నెట్స్‌లో గాయపడిన కరుణ్ నాయర్

## తొలి టెస్ట్‌కు దూరమయ్యే అవకాశాలు



ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ ప్రారంభానికి ముందే టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్ నెట్స్‌లో గాయపడినట్లు తెలుస్తోంది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ప్రసిధ్ కృష్ణ వేసిన బంతి కరుణ్ నాయర్‌కు బలంగా తాకినట్లు సమాచారం. దీంతో అతని పక్కటెముకలకు గాయమైందని వార్తలు వస్తున్నాయి. ఈ గాయం ధాటికి అతను ఇబ్బంది పడ్డాడని, ఆ తర్వాత మరోసారి బ్యాటింగ్ చేశాడని తెలుస్తోంది. అయితే గాయం తీవ్రత ఎక్కువైతే అతను తొలి టెస్ట్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో టీమిండియాకు కరుణ్ నాయర్ చాలా కీలకం. అతనికి కూడా ఈ సిరీస్ చాలా ముఖ్యం. 8 ఏళ్ల తర్వాత అతను మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. కరుణ్ నాయర్ చివరిసారిగా 2017లో టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఈ మధ్య దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించిన కరుణ్ నాయర్.. సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో టీమిండియా పిలుపును అందుకున్నాడు.కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం కూడా ఉండటంతో సెలెక్టర్లు అతనికి అవకాశం ఇచ్చారు. 2023, 2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్లలో నార్తంప్టన్ షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్‌ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ కూడా ఉంది. రంజీ ట్రోఫీలో విదర్భ తరఫున 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలతో పాటు రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో 8 ఇన్నింగ్స్‌ల్లో 779 పరుగులు చేశాడు.సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ 6 ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఐపీఎల్ 2025 సీజన్‌లో కూడా అవకాశం అందుకున్న కరుణ్ నాయర్.. మెరుగైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో భారత్-ఏ తరఫున ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ సాధించి సూపర్ జోష్‌లో ఉన్నాడు. లీడ్స్ వేదికగా శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయాలంటే.. కరుణ్ నాయర్ ఆడటం కీలకం. ఈ క్రమంలోనే అతని గాయం వార్తలు అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

# ఐదో నెంబర్లోనే బ్యాటింగ్ కు దిగుతా

## వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్




ప్రతిష్టాత్మక ఇంగ్లాండ్ తో ఐదు టెస్టుల సిరీస్ కు భారత్ సిద్ధమైంది. ఇక్కడికి చాలా రోజుల కిందటే చేరుకున్న భారత్.. తన సన్నాహకాలు ప్రారంభించింది. ఇప్పటికే ఇక్కడ కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్ లు కూడా ఆడింది. అయితే అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారత ప్లేయింగ్ లెవన్ పై కాస్త స్పష్టత వచ్చింది. తాజాగా భారత విధ్వంసక వికెట్ కీపర్ కమ్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్.. టీమిండియాలోని రెండు స్థానాలపై క్లారిటీ ఇచ్చాడు. అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్న నాలుగో నెంబర్లో ఎవరు బ్యాటింగ్ చేయనున్నారో తెలిపాడు. జట్టు కెప్టెన్ శుభమాన్ గిల్ ఈ స్థానంలో బ్యాటింగ్ కు వస్తాడని పేర్కొన్నాడు. ఒకప్పుడు సచిన్ టెండూల్కర్, ఆ తర్వాత విరాట్ కోహ్లీ ఈ స్థానంలో బ్యాటింగ్ కి దిగి పరుగుల వరద పారించారు. ఆ స్థానానికే ఒక వన్నె తెచ్చారు. అలాంటి స్థానంలో కెప్టెన్ గిల్ బ్యాటింగ్ కు వస్తాడని తెలిపాడు. ఇక తన రెగ్యులర్ స్థానమైన ఐదో నెంబర్లోనే బ్యాటింగ్ కు దిగుతానని పంత్ చెప్పుకొచ్చాడు. ఇక ఈ సిరీస్ లో అన్ని రంగాల్లో తన ప్రతిభ చాటాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ముఖ్యంగా బ్యాటింగ్, వికెట్ కీపింగ్ తోపాటు ఫీల్డింగ్ లోనూ రాణించాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ప్రతి మ్యాచ్ కు ముందు తను ఇలాగే భావిస్తానని, అందులో ఎలాంటి మార్పులేదని పేర్కొన్నాడు. కెప్టెన్ గిల్ తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆఫ్ ఫీల్డ్ లోనూ తాము సరదాగా ఉంటామని వ్యాఖ్యానించాడు. ఎల్లప్పుడూ సన్నిహితంగా ఉంటేనే, అది ఫీల్డ్ లోనూ ప్రతి ఫలిస్తుందని పేర్కొన్నాడు. ఇప్పటివరకు గిల్ నెం.3లో బ్యాటింగ్ చేసేవాడు. అతను ఆ స్థానాన్ని ఖాళీ చేయడంతో ఎవరు ఆడతారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిపోయింది. అయితే అనుభవం కల అభిమన్యు ఈశ్వరన్ లేదా యువ సంచలనం సాయి సుదర్శన్ లో ఎవరిని ఈ స్థానంలో ఆడిస్తారనేదానిపై స్పష్టత లేదు. ఈ విషయంపై టాస్ వేశాక స్పష్టత వస్తుందని తెలుస్తోంది. నెం.3లో ఎవరు ఆడతారు అనేది తనకు తెలియదని , దీనిపై చర్చలు జరుగుతున్నట్లు పంత్ పేర్కొన్నాడు. ఇక ఈనెల 20 నుంచి లీడ్స్ లో ప్రారంభమయ్యే తొలి టెస్టుకు ఇప్పటికే ఇంగ్లాండ్ ప్లేయింగ్ లెవన్ ను ప్రకటించింది. భారత్ కూడా తన జట్టు కూర్పుపై తుది కసరత్తు చేస్తోంది.



# చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్ బ్లిట్జ్ సెమీఫైనల్స్ లో సంచలన విజయం

భారత యువ గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ చరిత్రసృష్టించింది. లండన్ వేదికగా జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టీమ్ ఛాంపియన్‌షిప్ 2025లో సంచలన విజయం సాధించింది. గురువారం జరిగిన బ్లిట్జ్ సెమీఫైనల్స్ రెండో లెగ్‌లో దివ్య దేశ్‌ముఖ్ వరల్డ్ నెంబర్ వన్ మహిళా చెస్ ప్లేయర్ హౌ యిఫాన్(చైనా)ను ఓడించింది. ఈ గెలుపుతో భారత చెస్ చరిత్రలో ఈ ఘనతను అందుకున్న ప్లేయర్‌గా నిలిచింది. మొదటి లెగ్‌లో దివ్య యిఫాన్ చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండవ లెగ్‌లో తెల్ల పావులతో అద్భుత విజయాన్నందుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో దివ్య ప్రాతినిధ్యం వహించిన టీమ్ ర్యాపిడ్ విభాగంలో రెండో స్థానంలో.. బ్లిట్జ్ విభాగంలో మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగతంగా బ్లిట్జ్ ఫార్మాట్‌లో దివ్య ఆడిన ఎనిమిది గేమ్‌లలో ఆరు గెలిచి, ఒక డ్రా చేసుకుని, ఒకే ఒక ఓటమిని చవిచూసింది. హెక్సామైండ్ చెస్ క్లబ్ తరఫున దివ్యా పోటీ చేయగా.. హౌ యిఫాన్ డబ్ల్యూఆర్ చెస్ టీమ్ తరఫున బరిలోకి దిగింది. తాజా విజయంతో దివ్య దేశ్‌ముఖ్‌పై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఎక్స్ వేదికగా దివ్యను అభినందించారు. ఆమె విజయం ధైర్యానికి, పట్టుదలకు నిదర్శనమని, యువ చెస్ క్రీడాకారులకు ప్రేరణనిస్తుందని ట్వీట్ చేశారు. నాగ్‌పూర్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్, అంతర్జాతీయ మాస్టర్ ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ () టైటిల్స్ గెలిచింది. ఆమె ఇప్పటికే ఒలింపియాడ్, ఆసియా ఛాంపియన్‌షిప్, వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకాలను సాధించింది.19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు జితేంద్ర దేశ్‌ముఖ్, నమ్రత దేశ్‌ముఖ్‌లు వైద్యులు. చిన్న వయసులోనే చెస్ పట్ల ఆసక్తి కనబరిచిన దివ్య, ఐదేళ్ల వయసులోనే ప్రాక్టీస్ మొదలుపెట్టింది. ఆమె తండ్రి నుంచి చెస్ ఓనమాలు నేర్చుకుంది.2020లో జరిగిన ఫిడే ఆన్‌లైన్ చెస్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన భారత జట్టులో దివ్య దేశ్‌ముఖ్ ఓ సభ్యురాలు. 2021లో భారత్ నుంచి 22వ ఉమెన్ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు సాధించింది. 2022లో మహిళల ఇండియన్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. 2023లో కజకిస్తాన్‌లోని అల్మాటిలో జరిగిన ఆసియా మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. 2024లో మహిళల అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ను (వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్) గెలుచుకుంది.

# బెన్ స్టోక్స్ పునరాగమనం

## తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన



ఇండియాతో ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ప్లేయింగ్ లెవన్ ను అనౌన్స్ చేసింది. మ్యాచ్ కు రెండు రోజులు ముందుగానే తుది జట్టును ప్రకటించి, ముందంజలో నిలిచింది. అందరి అంచనాలకు తగినట్లుగానే ఈ తుదిజట్టు ఉండటం విశేషం. ఇక రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చాలా కాలం తర్వాత పునరాగమనం చేశాడు. అతను రావడంతో జట్టులో సమతూకం వచ్చింది. ఇక జట్టు విషయానికొస్తే ఓపెనర్లుగా విధ్వంసక ప్లేయర్లు జాక్ క్రాలీ, బెన్ డకెట్ ఆడతారు. వీరిద్దరూ ఇటివల సూపర్ ఫామ్ లో ఉన్నారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన నాలుగు రోజుల టెస్టులో మంచి భాగస్వామ్యాలతో మ్యాచ్ ను మలుపు తిప్పారు. ముఖ్యంగా డకెట్.. అటు వైట్ బాల్ తో పాటు, ఇటు రెడ్ బాల్ తో నూ ఆకట్టుకుంటున్నాడు. క్రాలీ కూడా పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడనే తన పేరును నిలబెట్టుకుంటున్నారు. వీరిద్దరూ ఓపెనింగ్ లో మంచి భాగస్వామ్యం అందించాలని టీమ్ మేనేజ్మెంటో కోరుకొంటోంది. నెం.3లో ఒల్లీ పోప్, ఆ తర్వాత వరుసగా మాజీ కెప్టెన్ జో రూట్, హేరీ బ్రూక్, బెన్ స్టోక్స్, జామీ స్మిత్ బరిలోకి దిగుతారు. నిజానికి నెం.3లో ఆర్సీబీ స్టార్ జాకబ్ బెతెల్ కు అవకాశం కల్పించాలని భావించినా, అనుభవానికి పెద్ద పీట వేస్తూ, పోప్ ను ఆడిస్తున్నారు. ఇక నాలుగో నెంబర్లో దిగ్గజ ప్లేయర్ రూట్ ఆడుతున్నాడు. తను కూడా సూపర్ ఫామ్ లో ఉన్నాడు. గతనెలలో జింబాబ్వేపై మంచి ప్రదర్శన కనబర్చాడు. ఆ తర్వాత బ్రూక్ కూడా సత్తా చాటాలని భావిస్తున్నాడు. టెస్టులను కూడా టీ20 తరహాలో ఆడే బ్రూక్.. సొంతగడ్డపై తన పదును చూపించాలని భావిస్తున్నాడు. స్టోక్స్ తిరిగి రావడంతో అటు మిడిలార్డర్ బ్యాటర్ గానూ, ఇటు ఐదో బౌలర్ గానూ సేవలందించగలడు. తన రాక ఇంగ్లాండ్ కి ఎంతో పెద్ద ప్లస్ పాయింట్. ఆ తర్వాత జేమీ స్మిత్ ..వికెట్ కీపర్ బ్యాటర్ గా సేవలందించనున్నాడు. వైట్ బాల్ క్రికెట్లో డకెట్ తో కలిసి ఓపెనింగ్ చేసిన స్మిత్.. టెస్టుల్లో మాత్రం ఏడో స్థానంలో బరిలోకి దిగుతాడు. ఇక ఆల్ రౌండర్ క్రిస్ వోక్స్ అందుబాటులోకి రావడంతో బ్యాటింగ్ లో డెప్త్ పెరిగింది. గాయం కారణంగా డిసెంబర్ నుంచి ఆటకు దూరమైన వోక్స్ తిరిగి జట్టులోకి వచ్చాడు. పేసర్లుగా బైడెన్ కార్స్, జోష్ట టంగ్ బరిలోకి దిగుతారు. ఇక ఏకైక స్పిన్నర్ గా షోయబ్ బషీర్ ఆడతాడు. గాయాలతో రెగ్యులర్ పేసర్లు జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్ దూరం కావడం ఇంగ్లాండ్ కు కాస్త మైనస్ పాయింట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.

భారత్ తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ ప్లేయింగ్ లెవన్:
స్టోక్స్ (కెప్టెన్), డకెట్, క్రాలీ, పోప్, రూట్, బ్రూక్, స్మిత్, వోక్స్, టంగ్, కార్స్, బషీర్.

# సన్‌రైజర్స్ జట్టులో కీలక మార్పులు!

ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) తీవ్రంగా నిరాశపర్చింది. డిఫెండింగ్ రన్నరప్‌గా భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటిదారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడింది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయంతో ఈ సీజన్‌ను ముగించింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది.మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు అంచనాలకు తగ్గట్లు ఆడలేకపోయారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ఈ సీజన్ వైఫల్యం నేపథ్యంలో వచ్చే ఏడాదికి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కీలక మార్పులు చేసే అవకాశం ఉంది. జట్టు బలహీనతలను అధిగమించేందుకు భారంగా మారిన ఆటగాళ్లను వేలంలోకి వదిలేసే ఛాన్స్ ఉంది.స్పెషలిస్ట్ స్పిన్నర్ కోటాలో రూ. 2.40 కోట్లకు కొనుగోలు చేసిన ఆడమ్ జంపా ఆరంభంలోనే గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అతని గైర్హాజరీ సన్‌రైజర్స్ విజయవకాశాలపై ప్రభావం చూపింది. అతను ఈ సీజన్‌లో 2 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 2 వికెట్లు పడగొట్టాడు. ఓవర్‌సీస్ ప్లేయర్ అయిన జంపాను వదిలేసి ఐపీఎల్ 2026 మినీవేలంలో దేశవాళీ స్పిన్నర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ తీసుకునే అవకాశం ఉంది.మరో స్పెషలిస్ట్ స్పిన్నర్ రాహుల్ చాహర్ కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ కొంపముంచాడు. రూ. 3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన చాహర్ పేలవ ఫామ్‌తో తుది జట్టులో చోటే దక్కించుకోలేకపోయాడు. ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ఒక్క ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. అతని వైఫల్యం కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ అవకాశాలను దెబ్బతీసింది. రాహుల్ చాహర్‌ను కూడా ఆరెంజ్ ఆర్మీ వదులుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు రాహుల్ చాహర్ దేశవాళీ ప్రదర్శనపై ఈ నిర్ణయం ఆధారపడి ఉంటుంది. మూడో స్పెషలిస్ట్ స్పిన్నర్ జీషన్ అన్సారీ తన తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి ఆశలు రేకెత్తించాడు. కానీ ఆ తర్వాత ఆ జోరును కొనసాగించలేకపోయాడు. 10 మ్యాచ్‌ల్లో 9.84 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. అతని వైఫల్యం కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ కొంపముంచింది. అయితే రూ. 40 లక్షలకే జీషన్ అన్సారీని కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. రిలీజ్ చేసే ముందు అతని ఫామ్‌ను పరిగణలోకి తీసుకునే ఛాన్స్ ఉంది.%జ%ఫినిషర్‌గా జట్టుకు ఉపయోగపడుతాడని భావించి రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. ఆరంభంలో వరుస మ్యాచ్‌ల్లో అవకాశం కల్పించినా అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 8 మ్యాచ్‌ల్లో 12.20 స్ట్రైక్‌రేట్‌తో 61 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే అతన్ని వదిలేసి మరో భారత బ్యాటర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ తీసుకునే అవకాశం ఉంది.

ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలంలో మహమ్మద్ షమీని రూ. 10 కోట్ల భారీ ధరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేసింది. షమీ కోసం సుదీర్ఘ కాలంగా జట్టుకు ఆడిన భువనేశ్వర్ కుమార్‌ను కూడా వదులుకుంది. కానీ షమీ ఈ సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచాడు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. వరుస అవకాశాలు ఇచ్చినా షమీ ప్రదర్శన మెరుగవ్వకపోవడంతో అతన్ని తుది జట్టు నుంచి తప్పించి బెంచ్‌కే పరిమితం చేశారు. షమీ లేని 5 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ మూడు విజయాలు నమోదు చేసింది. పైగా షమీ వయసు కూడా పైబడటంతో అతన్ని వదిలేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఫ్లాట్‌గా ఉండే ఉప్పల్ వికెట్‌పై షమీ ప్రభావం చూపలేకపోతున్నాడు.





# 8 వసంతాలతో లక్ పరీక్షించుకోనున్న కేరళ కుట్టి

మలయాళ ఇండస్ట్రీ నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు టాలీవుడ్‌లో తమ లక్ పరీక్షించుకునేందుకు వస్తుంటారు. అలా వచ్చిన మరో ముద్దుగుమ్మ అనంతిక సనిల్ కుమార్. 15 ఏళ్లకే యాక్టింగ్ కెరీర్‌లోకి అడుగుపెట్టింది ఈ కేరళ కుట్టీ. బేసికల్లీ క్లాసిక్ డ్యాన్సర్. యాక్టింగ్ పై ప్యాషన్‌తో నటనవైపు అడుగులేసిన అనంతిక రాజమండ్రి రోజ్ మిల్క్ చిత్రంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది. మ్యాడ్‌లో నార్నే నితిన్‌కు జోడీగా నటించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కానీ ఆ ఆనందాన్ని మిగల్చేదు తమిళ ఇండస్ట్రీ. కోలీవుడ్‌లో నటించిన రెండు చిత్రాలు రైడ్, లాల్ సలామ్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో వచ్చిందే 8 వసంతాలు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 8 వసంతాలు మరికొన్ని గంటల్లో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతోంది. పొయెటిక్, ఫీల్ గుడ్ మూవీగా తీసుకు వస్తున్న ఈ సినిమా కథ ఆమె చుట్టూనే తిరుగుతోంది. అయితే కుబేరకు పోటీగా రాబోతుంది. స్టార్ హీరోలకే థియేటర్లకు రావడం కష్టమౌతున్న ఈ టైంలో ఓ ఉమెన్ సెంట్రిక్ అండ్ లవ్ స్టోరీతో వస్తున్నసినిమా కోసం థియేటర్లకు వస్తారా అన్న డౌట్ వస్తోంది.



# 21న కన్నప్ప ప్రీ రిలీజ్ ఈవెంట్

మంచు విష్ణు హీరోగా, ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'కన్నప్ప'. జూన్ 27న విడుదల కాబోతున్న ఈ భారీ చిత్రంలో పలువురు స్టార్ అందరు భాగం అవుతున్నారు. కానీ ప్రేక్షకులను థియేటర్లకు రపించేది మాత్రం ప్రభాస్ ఒక్కరే అన్నది ఇండస్ట్రీలో స్పష్టంగా వినిపిస్తున్న మాట. ఈ విషయాన్ని విష్ణు కూడా బాగా తెలుసుకున్నారు. అందుకే సినిమా ట్రైలర్‌లో ప్రభాస్‌కి ఎక్కువ స్క్రీన్ స్పేస్ ఇచ్చేలా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ పాత్ర సుమారు అరగంట పాటు ఉండనుందని, ఇది తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచే సినిమా అవుతుందని ప్రభాస్ కూడా ఇప్పటికే పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. అయితే తాజాగా ఈ మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు సంబందించిన వార్త వైరల్ అవుతుంది. జూన్ 21న హైదరాబాద్‌లో సాయంత్రం 6 గంటలకు ఈ ప్రీ-రిలీజ్ వేడుక ఘనంగా జరగనుంది. ఇందులో నటించిన స్టార్ అందరితో పాటు మిగతా టీమ్ మొత్తం హాజరు కానుంది. కానీ ప్రభాస్ హాజరవుతాడా? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఇక ప్రభాస్ కూడా హాజరైతే ఈ ఈవెంట్‌కి మరింత జోష్ వస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఇప్పటికే మోహన్ బాబు వ్యక్తిగతంగా ఫోన్ చేసి ప్రభాస్‌ను ఆహ్వానించాడట. మరి చూదాం డార్లింగ్ వస్తారో రారో..

# నేరుగా ఓటిటిలోకి ఉప్పుకప్పురంబు




ఇండస్ట్రీలో కొన్ని కలయికలను అసలు ఎవరూ ఊహించలేం. అలాంటి కలయికల్లో ఒకటి సుహాస్, కీర్తి సురేష్ . వీరిద్దరి కాంబోలో 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా తేరకెక్కిన్న సంగతి తెలిసిందే. అని. ఐ. వి శశి దర్శకత్వంలో ఈ సినిమాకు వసంత్ మరళీ కృష్ణ కథ అందించగా, ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై. లి బ్యానర్ పై రాధికా లావు నిర్మిస్తున్నారు. 90ల బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ సినిమాలో సెటైర్, కామెడీతో పాటూ ఓ సామాజిక సమస్య గురించి కూడా ప్రస్తావించినట్టు మేకర్స్ తెలిపారు. ఈ సినిమా ఆహ్లాదకరంగా, సెటైరికల్ గా ఉంటూనే ఆడియన్స్ ను ఎంతో ఆలోచింపచేసేదిగా ఉండనుందట.కాగా ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఓటీటీ రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు మేకర్స్ .. 'ఉప్పు కప్పురంబు' సినిమా జులై 4 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 240కు పైగా దేశాల్లో ప్రైమ్ వీడియోలో స్పెషల్ గా ప్రీమియర్ కానున్నట్టు తెలిపారు. తెలుగులో రిలీజ్ కానున్న ఈ సినిమా తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో డబ్బింగ్ తో అందుబాటులోకి రానుంది. అయితే ఇప్పటికే టీజర్ ఆకట్టుకోగా..తాజాగా ఈ మూవీ ట్రైలర్ కూడా రిలీజ్ చేశారు. కాగా ట్రైలర్ గనుక పరిశీలిస్తే.. ఊరి స్మశానంలో ఇంకా కేవలం నలుగురికి మాత్రమో చోటు ఉంటుంది. ఊరి పెద్దగా అధికారంలోకి వచ్చిన కీర్తి సురేష్ దాని ఎలా సాల్వ్ చేసింది? అనేది స్టోరి. కాగా విలేజ్ డ్రాప్ లో పూర్తి ఎంటర్ ట్రైనింగ్ మూవీ గా వస్తున్న ఈ మూవీలో కీర్తి లుక్ మొత్తం మార్చేసింది. చాలా రోజులకు బాబుమోహాన్ మంచి కం బ్యాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సుహాస్ కూడా మంచి కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు. టోటల్ గా ట్రైలర్ మాత్రం కాస్త కన్ఫ్యూజన్ గాను ఇటు ఎంట్టంల్గ÷నింగ్ గాను ఆకట్టుకుంది.

# పెద్ది సినిమా నుంచి మరో లుక్ విడుదల

రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'పెద్ది'. ఇప్పటికే భారీ హైప్‌ను సెట్ చేసుకున్న ఈ ప్రాజెక్ట్ లో చాలామంది క్రేజీ స్టార్‌లు భాగమవుతున్నారు. వారిలో ఓటిటిలో సంచలనంగా నిలిచిన 'మిర్జాపూర్' సిరీస్ ఫేమ్.. మున్నా భయ్యా అంటేనే గుర్తుకు వచ్చే దివ్యేంద్ర శర్మ కూడా ఉన్నారు.ఈ సినిమాలో దివ్యేంద్ర శర్మ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవల విడుదలైన అతడి ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన రాబట్టింది. తాజాగా మేకర్స్ మున్నా భయ్యా పుట్టినరోజు సందర్భంగా మరో స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దివ్యేంద్ర క్రికెట్ బాల్ పట్టుకుని మాస్ లుక్‌లో పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తున్నాడు. కాగా అతను ఈ సినిమాలో 'రామ్ బుజ్జి' అనే పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికి ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుండగా ఫ్యాన్స్‌లో హైప్ పెంచేస్తోంది. ఈ భారీ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న గ్రాండ్‌గా విడుదల కానుంది.




# ఆ క్షణం చాలా ప్రత్యేకం...

## ప్రభాస్ పై మాళవిక మోహనన్ ప్రశంసల వర్షం!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు మారుతి రూపొందిస్తున్న హారర్ ఫాంటసీ చిత్రం 'ది రాజాసాబ్'. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నటిస్తున్న ముగ్గురు హీరోయిన్లలో ఒకరైన మాళవిక మోహనన్, ప్రభాస్‌తో తన తొలి పరిచయం గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇటీవల తన అభిమానులతో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ముచ్చటించిన ఆమె, పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.'ది రాజాసాబ్' సినిమా సెట్స్‌లో మీకు బాగా నచ్చిన సందర్భం ఏంటి అని ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు మాళవిక స్పందిస్తూ, "ప్రస్తుతం మేమంతా 'ది రాజాసాబ్' టీజర్ సృష్టించిన ఉత్సాహంలో ఉన్నాం కాబట్టి ముందుగా ఈ ప్రశ్నకు సమాధానం చెబుతాను. మా సినిమా సెట్స్‌లో ప్రభాస్ గారిని మొదటిసారి కలిసిన క్షణం నాకెంతో ప్రత్యేకమైనది" అని తెలిపారు.ఆమె ఇంకా మాట్లాడుతూ, "నేను వేరే సినిమా షూటింగ్ ముగించుకుని, అసలు నిద్ర లేకుండానే హైదరాబాద్ వచ్చాను. అప్పుడు చాలా అలసిపోయి, నీరసంగా ఉన్నాను. కానీ, ప్రభాస్ గారిని చూడగానే నాలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది! ఆయన చాలా ఆకర్షణీయంగా, ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించారు. అంతేకాదు, ఆయన అద్భుతమైన సంభాషణా చతురుడు కూడా!" అని ప్రభాస్‌పై ప్రశంసలు కురిపించారు.ఆసక్తికరంగా, 'ది రాజాసాబ్' చిత్రాన్ని భారతదేశంలోనే అతిపెద్ద హారర్-ఫాంటసీ సెట్‌లో చిత్రీకరించారు. ఈ సినిమా కోసం రహస్యాలు, భయంకరమైన నిశ్శబ్దంతో కూడిన ఒక భారీ పురాతన భవంతిని నిర్మించారు. ఇటీవల విడుదలైన సినిమా టీజర్‌లో ప్రభాస్ రెండు విభిన్నమైన లుక్స్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్, మాళవిక మోహనన్‌లతో పాటు సంజయ్ దత్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ వంటి ప్రముఖ నటీనటులు కూడా నటిస్తున్నారు. వీరంతా ఈ పురాతన భవంతి కథకు మరింత మిస్టరీని జోడిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. 'ది రాజాసాబ్' ఈ ఏడాది డిసెంబర్ 5న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా ఎంటర్‌టైనర్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సౌత్ ఇండియాలోని ప్రముఖ సంగీత దర్శకుల్లో ఒకరైన థమన్ సంగీతం సమకూరుస్తున్నారు.



# శరవేగంగా 'మెగా157' షూటింగ్...

## ముస్సోరీ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి తన 157వ సినిమా చిత్రీకరణలో జోరు చూపిస్తున్నారు. ప్రస్తుతం 'మెగా 157' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్ మీదున్న ఈ సినిమాకు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ అందింది. ముస్సోరీలోని సుందరమైన ప్రదేశాలలో జరుగుతున్న రెండవ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో సినిమా మరో ముఖ్యమైన ఘట్టాన్ని పూర్తి చేసుకుంది.




ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ముస్సోరీ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇటీవలే నయనతార కూడా ఈ షెడ్యూల్‌లో పాలుపంచుకున్నారు. హీరో, హీరోయిన్లపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు, ఓ ప్రత్యేక గీతాన్ని కూడా ఇక్కడ చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముస్సోరీ షెడ్యూల్ పూర్తి కావడంతో, తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. "2026 సంక్రాంతికి మెగా 157తో వినోదం పంచడానికి సిద్ధంగా ఉన్నాం. తదుపరి షెడ్యూల్‌ను ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఎదురుచూస్తున్నాం" అని దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.ఈ సినిమాలో చిరంజీవి ద్విపాత్రాభినయం చేయనున్నారనే వార్తలు టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ఒక పాత్ర పాత చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటే, మరో పాత్ర పూర్తి యాక్షన్ మోడ్‌లో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దర్శకుడు అనిల్ రావిపూడి, చిరంజీవి పాత్ర పేరును 'శివ శంకర్ వర ప్రసాద్'గా ఖరారు చేసినట్లు కూడా వార్తలు వస్తున్నాయి.గత కొన్నేళ్లుగా యాక్షన్ డ్రామాలు చేస్తున్న చిరంజీవి, ఈసారి పూర్తిస్థాయి హాస్యంతో ప్రేక్షకులను అలరించనుండటం విశేషం. 'ఎఫ్3' సినిమా విజయంతో మంచి ఊపు మీదున్న అనిల్ రావిపూడి, ఈ సినిమాతో మరో బ్లాక్‌బస్టర్ కొట్టాలని పట్టుదలగా పనిచేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మెగా అభిమానులతో పాటు, సాధారణ ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2026 సంక్రాంతికి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.